www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
03.02.2024
సంపుటి:2 సంచిక:107

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## ఎవడ్రా..!

# మా ప్రభుత్వాన్ని పడగొట్టేది..

- ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి గర్జన
- ప్రజల ప్రభుత్వాన్ని ఏం చేయలేరని ఫైర్
- కేసీఆర్ ఫ్యామిలీఅవినీతిపై సంచలన ఆరోపణలు
- 15 రోజుల్లో15 వేల పోలీస్‌జాబ్స్‌భర్తీ చేస్తామని వెల్లడి
- రూ. 500 గ్యాస్ సిలిండర్, రూ. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్
- తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు అధికారమిచ్చి కృతజ్ఞతలు
- ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎంపీ ఎన్నికల శంఖారావం

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల వేడి.. ప్రారంభంలోనే పతకాస్థాయికి చేరుకుంది. ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి శంఖారావం పూరించారు . ఆరు గ్యారంటీల అమలు మొదలు ప్రతిపక్షాల విమర్శల దాకా.. అన్ని అంశాలపైనా దూకుడుగా కౌంటర్లు వేశారు. బీఆర్ఎస్, బీజేపీలే టార్గెట్‌గా .. పదునైన వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. పార్లమెంట్ నియోజకవర్గాల పర్యటనలో భాగంగా తొలి సభను ఇంద్రవెల్లి నుంచే శుక్రవారం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సభా వేదికపై ప్రసంగించిన సీఎం .. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అందిన కాడికి దోచుకుని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి డబ్బులు లేకుండా చేశారని విమర్శించారు. రూ. 7 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా కేసీఆర్ కుటుంబం మిగిల్చిందని మండిపడ్డారు.



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

**కేసీఆర్‌ఫ్యామిలీ విధ్వంసం అంతా ఇంతా కాదు..**

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ పేరుతో రూ. 40 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రూ. 7 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఫండ్స్ లేకుండా చేశారని ఆరోపించారు. దోపిడీ పాలన కారణంగా, పదేండ్ల దుర్మార్గ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏమైనా కేసీఆర్ కుటుంబం కోసం వచ్చిందా? అని వ్యాఖ్యానించారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ సర్కార్ అడవి బిడ్డలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు మొండిచేయి చూపిన కేసీఆర్.. తన బిడ్డ కవితను మాత్రం ప్రజలు ఓడించినా ఎమ్మెల్సీతో ఉద్యోగం ఇచ్చారంటూ తీవ్ర విమర్శలు చేశారు.

**15 రోజుల్లో 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలు..**

రాబోయే 15 రోజుల్లో 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేందుకు కోర్టు కేసులు పరిష్కరిస్తారం అయ్యేలా పని చేస్తున్నామని చెప్పారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 15వేల కానిస్టేబుళ్ల ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదని

..మిగతా 2 లో




# ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి..

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ
- ప్రజా భవన్ ముందు ఆటోను తగలబెట్టినా స్పందించరా?
- డ్రైవర్లకు ప్రతినెలా రూ. 10 వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఆటో డ్రైవర్ల సమస్యపై తన లేఖలో ప్రస్తావించారు. ఆటో డ్రైవర్ సోదరులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు వెంటనే అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియక ఇటీవలి కాలంలో ఏకంగా 15 మంది ఆటోడ్రైవర్లు రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారంటే.. పరిస్థితి ఎంత చేజారిపోయిందో అర్థమైపోతోందన్నారు. ఆటోలు ఎక్కేవాళ్లు లేకపోవడంతో తమ కుటుంబం గడవని పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా స్పందించరా ? అని ప్రశ్నించారు. గురువారం ఒక గిరిజన ఆటోడ్రైవర్ సోదరుడు ఏకంగా బేగంపేటలోని ప్రజాభవన్ ముందు తనకు ఇంతకాలం బువ్వ పెట్టిన ఆటోను చేతులారా తగలబెట్టుకున్న సంఘటన చూసి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి గుండె బరువెక్కిందన్నారు. ఉపాధి లేక ప్రజాభవన్ ముందే ఆటోను తగలబెట్టుకున్నా కనికరించరా? అని మండిపడ్డారు. అన్నం పెట్టిన ఆటో ఆకలి మంటల్లో కాలిపోయిన ఉదంతాన్ని చూసిన తరువాతైనా.. పరిస్థితి తీవ్రతను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, రాష్ట్రంలోని 6.50 లక్షల మంది ఆటోడ్రైవర్ల పక్షాన కోరుతున్నానని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న ఆరున్నర లక్షల మంది డ్రైవర్లకు ప్రతినెలా 10 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. 15 మంది ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమైన ప్రభుత్వం వెంటనే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతున్నామన్నారు.



# ఎంపీ టికెట్ కోసం 'బండ్ల' అప్లికేషన్..

- కేసీఆర్ కాళ్లు మొక్కి మరీ 'గడల' పార్టీ జంప్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తుల్లో ఇవాళ ఆసక్తికరమైన పరిణామాలు కనిపించాయి. నటుడు కమ్ సినీ నిర్మాత, కాంగ్రెస్ వీరాభిమాని అయిన బండ్ల గణేష్ ఎంపీ సీటు కోసం దరఖాస్తు ఇచ్చారు. విశేషం ఏంటంటే.. రేవంత్ రెడ్డి ఖాళీ చేసిన స్థానం కోసమే ఆయన దరఖాస్తు చేసుకున్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు.. మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నారు. ఆ స్థానం కోసం సినీ నిర్మాత బండ్ల గణేష్ కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఇక.. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యానారాయణ ఏకంగా నాలుగు సీట్లకు నాలుగు దరఖాస్తులు సమర్పించారు. మరోవైపు నాగర్‌కర్నూల్ టికెట్ కోసం మాజీ మంత్రి చంద్రశేఖర్ కుమార్తె చంద్రప్రియ కూడా అప్లికేషన్ సమర్పించారు.

**కేసీఆర్ కాళ్లు మొక్కి..**

ఇదిలా ఉంటే.. గాంధీభవన్‌లో ఇవాళ సమర్పించిన దరఖాస్తుల్లో ఆసక్తికరమైన చర్చకు దారి తీసిన అంశం.. గడల శ్రీనివాసరావు. తెలంగాణ హెల్త్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలోనే రాజకీయాంశాలతో చర్చనీయాంశంగా మారారాయన. సీఎంగా ఉన్న కేసీఆర్ కాళ్లు కూడా మొక్కుతూ వార్తల్లోకి ఎక్కారు కూడా. అంతేకాదు.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొత్తగూడెం టికెట్ ఆశించి భంగపడ్డారాయన. ఇప్పుడు.. ఖమ్మం, సికింద్రాబాద్ ఎంపీ టిక్కెట్ కోసం గాంధీ భవన్ లో దరఖాస్తు చేసుకుని మరోసారి ఆయన హాట్ టాపిక్‌గా మారారు. తన సన్నిహితుల ద్వారా గాంధీ భవన్ లో దరఖాస్తు చేయించినట్లు తెలుస్తోంది. తద్వారా ఎన్నికల్లో పోటీ చేయకుండానే.. జంప్ జిలానీగా గడల మారినట్లు చర్చ నడుస్తోంది.

## పార్టీ మార్పుపై మర్రి జనార్దన్ రెడ్డి క్లారిటీ

- అవన్నీ వదంతులని కామెంట్

..మిగతా 2 లో



# బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సర్వనాశనం

- ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్
- కాళేశ్వరం కట్టేందుకు 94 వేల కోట్లు ఖర్చు..
- కానీ లక్ష ఎకరాలకు కూడా సాగునీరందడం లేదు
- ఏడు సార్లు గెలిచినా లేని ఆనందం ఇప్పుడు కలుగుతోంది
- వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని పిలుపు

**విశాల భారతి, హైదరాబాద్:**

పదేండ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీ చందర్ రెడ్డి నిర్వహిస్తున్న పాలమూరు న్యాయ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్‌లో నిర్వహించిన సభకు మంత్రి ఉత్తమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నెన్నో మాటలు చెప్పారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి 27 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కేసీఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరానికి రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే లక్ష ఎకరాలకు కూడా నీరు అందడం లేదన్నారు.

ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్టుకు రూ.7500 కోట్లు ఖర్చు చేస్తే ఏ మాత్రం ఫలితాలు లేవు అన్నారు. పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన కోయిల్ సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్లకు సంబంధించిన పనులను కూడా అసంపూర్తిగా వదిలి పెట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరురంగారెడ్డి పథకం కింద చేపట్టిన ప్రతి ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున మాట ఇస్తున్నానని పేర్కొన్నారు. సంగం బండ రిజర్వాయర్ కింద నష్టపోయిన వారికి 30 కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని నెల రోజులలో అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ నెల ఐదున కొడంగల్ నియోజకవర్గ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి మక్తల్‌నారాయణపేటకొడంగల్ ప్రజలకు ఒక శుభవార్తను ప్రకటించబోతున్నారు. లక్షన్నర ఎకరాలకు సాగునీటిని అందించేందుకు వీలుగా చేపట్టనున్న పథకాన్ని గురించి ప్రకటిస్తారు అని మంత్రి తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో 25 ఎకరాలకు ఆ పథకం వల్ల సాగునీరు అందనుందని మంత్రి తెలిపారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఫలానా దగ్గర కొంత ఖర్చు పెడితే సాగునీరు వస్తుంది అని చెప్పగలిగితే అక్కడ

..మిగతా 2 లో

## ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు

# 'పల్లెకు పోదాం'

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ తెలిపారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్ని కింది స్థాయి వరకు తీసుకెళ్ళేందుకు ఈరోజు మీటింగ్ లో చర్చించామన్నారు. పార్లమెంట్ నియోజక వర్గాల్లో ముఖ్య నేతల పర్యటన ఉంటుందని ఆమే పేర్కొన్నారు. అంతేకాకుండా.. ఫిబ్రవరి 5 నుండి 8 వరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామంలో 24

..మిగతా 2 లో



## ఎంపీ ఎన్నికల్లో ఏ పార్టీతో

# కలవాల్సిన అవసరం లేదు

## కాంగ్రెస్‌వి బ్లాక్ మెయిల్ పాలిటిక్స్

- నేడు ఒకట్రెండు రాష్ట్రాలకే పరిమితమైంది
- ఖమ్మం కాంగ్రెస్ నేతలు అంకిరెడ్డి సుధీర్ రెడ్డి, బొల్లపు సురేందర్ రెడ్డి బీజేపీ లో చేరిక
- బిల్డర్లు, వ్యాపారులకు బెదిరింపులు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:**

మాజీ ముఖ్యమంతరి కేసీఆర్ హయాంలో నగర పరిసరాల్లోని ఎన్నో భూముల చేతులు మారాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు. వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పీసీసీ జాయింట్ సెక్రటరీ అంకిరెడ్డి సుధీర్ రెడ్డి, బొల్లపు సురేందర్ రెడ్డి శుక్రవారం కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీ చేరారు. అనంతరం 2024 నూతన సంవత్సర డైరీని బీజేపీ పీఆర్వో పరమేశ్వర్ తో కలిసి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ది అక్రమాల చరిత్ర అని మండిపడ్డారు. అందుకే ఆ పార్టీ ఒకట్రెండు రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ తీరు చూస్తే అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేలా లేదని ఆయన ఎద్దేవాచేశారు. గత పదేండ్లలో అభివృద్ధికి బదులు బీఆర్ఎస్.. ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలు బీజేపీలో చేరాలని కిషన్ రెడ్డి కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఏ పార్టీతో కలవాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు. ఫిబ్రవరి మొత్తం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీజేపీలో చేరికలు ఉంటాయని కేంద్ర మంత్రి

..మిగతా 2 లో




# అసైన్డ్‌ల్యాండ్ క్రయ విక్రయంపై నోటీసులు జారీ

- 'గౌరెల్లి భూ బాగోతం' కథనానికి తహసీల్దార్ స్పందన

**విశాల భారతి, రంగారెడ్డి బ్యూరో:**

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం..గౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో రూల్స్‌కు విరుద్ధంగా అసైన్డ్‌ల్యాండ్ క్రయ విక్రయాలు, ఆశ్రమ నిర్వహణపై ఇటీవల 'విశాల భారతి' లో 'గౌరెల్లిలో భూబాగోతం' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్ వేగంగా స్పందించారు. గురువారం గౌరెల్లిలో ఫీల్డ్‌విజిట్ చేసి విచారణ చేపట్టారు. గౌరెల్లి పరిధిలో గల సర్వే నంబర్ 238 (అసైన్డ్‌మెంట్ ల్యాండ్) లో క్రయవిక్రయాలు చేసి.. అందులో అనాథ ఆశ్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని భూమి విక్రయించిన వారికి, కొనుగోలు చేసి అనాథ ఆశ్రమం నడుపుతున్న నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. వివరణల ప్రకారం.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా సదరు భూమిని పీవోటీ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ దత్ మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పేద దళితులకు వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించిన అసైన్డ్‌మెంట్ ల్యాండ్ ను లబ్ధిదారుడు ఇతరులకు అమ్మడం కానీ, బహుమతి రూపంలోకూడా ఇవ్వకూడదన్నారు. కొనుగోలు చేసేవారు కూడా .. అసైన్డ్ ల్యాండ్స్‌అస్సలు కొనుగోలు చేయవద్దని, ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రయ విక్రయాలకు పాల్పడిన వారిపై కూడా చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని, దీన్ని ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు.

# పార్టీ మార్పుపై మర్రి జనార్దన్ రెడ్డి క్లారిటీ


- అవన్నీ వదంతులని కామెంట్
- తాను వెళ్లాలనుకుంటే కేసీఆర్‌కు చెప్పే వెళ్తా..?



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్థన్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ మార్పు వార్తలపై స్పందించారు. అవన్నీ వదంతులని ఒకదానికొకటి సంబంధం లేకుంటా వస్తుంటాయన్నారు. తానుగా ఎవర్నీ సంప్రదించలేదన్నారు. అయితే కొన్ని పార్టీలు నన్ను మల్కాజ్ గిరి, మహబూబ్ నగర్ నుంచి పోటీ చేయాలని అడిగాయన్నారు. తమ పార్టీతో పాటు కాంగ్రెస్, బీజేపీలు నన్ను అడిగాయన్నారు. అయితే తాను ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు.

తాను గెలిచిన ఎమ్మెల్యేను కాదు .. పార్టీ అధిష్ఠానంకు సంప్రదింపుల అంశాన్ని చెప్పానన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒడిపోయినంత మాత్రాన పార్టీ మారుతా అనుకోవడం తప్పన్నారు. కేసీఆర్‌తో చెప్పకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోనని స్పష్టం చేశారు. డబ్బులు ఉంటే స్కూల్స్ కడతా.. పార్టీకి ఫండ్ ఎందుకు ఇస్తా అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డబ్బును ఏనాడూ రాజకీయం చేయలేదని వివరించారు. పేదలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కొందరు పార్టీ ఎమ్మెల్యేలు దొంగదారిన తనను కలుస్తున్నారు తప్ప తానెవరినీ కలవడం లేదన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉండలా వద్దా.. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న ఆలోచనలో ఉన్నానన్నారు.



# బలగాల ఉపసంహరణపై భారత్ – మాల్దీవుల మధ్య భేటీ..

ఇటీవల భారత్ - మాల్దీవుల మధ్య దౌత్యపరమైన వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో కీలక పరిమాణం చోటుచేసుకుంది. ప్రస్తుతం మాల్దీవుల్లో ఉన్న భారత సైనిక బలగాల ఉపసంహరణ అంశంపై ఈరోజు (శుక్రవారం) కోర్ కమిటీ సమావేశం దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. ఇందులో ఇరు దేశాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**భారత బలగాలు వెళ్లిపోవాలి**

అయితే ఇటీవల మాల్దీవుల్లో జరిగిన ఎన్నికల్లో చైనాకు అనుకూలంగా ఉండే మహ్మద్ మయిజ్జు అధికారంలోకి రావడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరంగా దుమారం రేపింది. ఈ క్రమంలోనే మార్చి 15వ తేదీ నాటికి తమ దేశ భూభాగం నుంచి భారత బలగాలు వెళ్లిపోవాలని మయిజ్జు ఇటీవల గడువు విధించారు. 2023 డిసెంబర్‌లో భారత ప్రధాని మోదీతో.. మయిజ్జు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ విషయం గురించి ప్రస్తావించారు. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు కోర్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని ఇరుదేశాలు నిర్ణయించాయి.

**80 మందితో భారత సైన్యం**

రెండు వారల క్రితమే ఈ కమిటీ మాలెలో సమావేశం కాగా.. ఇప్పుడు మరోసారి ఢిల్లీలో భేటీ అయ్యింది. అయితే ఈ అంశంలో పరస్పర ప్రయోజనాలు చేకూర్చేలా.. పరిష్కరం కనుగొనడంపై ఇరు దేశాలు కూడా దృష్టి సారించాయి. అయితే మాల్దీవుల్లో 80 మందితో కూడిన భారత సైన్యం ఉంటోంది. ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల నిర్వహణ బాధ్యతలను చూసుకుంటోంది. మరో విషయం ఏంటంటే భారత యుద్ధ నౌకలు మాల్దీవుల ప్రత్యేక ఆర్థిక జోన్‌లో గస్తీకి సైతం సహకరిస్తాయి.

**ఇరు దేశాలకు ప్రయోజనాలు చేకూర్చేలా**

ఈ క్రమంలోనే రెండు వారాల క్రితం ఈ కమిటీ మాల్దీవుల రాజధాని మాలెలో భేటీ అయ్యింది. తాజాగా దిల్లీలో మరోసారి సమావేశం నిర్వహించింది. ఈ అంశంలో పరస్పర ప్రయోజనం చేకూర్చే పరిష్కారాన్ని కనుగొనడంపై ఇరు దేశాలు దృష్టి సారించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# ఎవడ్రా..! మా ప్రభుత్వాన్ని పడగొట్టేది..

**మొదటిపేజీ తరువాయి**

సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే 7వేల మంది స్టాఫ్ నర్సులకు ఉద్యోగాలిచ్చామని చెప్పారు సీఎం రేవంత్.

**త్వరలోనే రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్..**

త్వరలోనే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సీఎం చర్యలు తీసుకుంటామన్నారు.

**ఆనాడే క్షమాపణలు చెప్పా..**

రాంజీగోండ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని ప్రకటించారు సీఎం. ఆదివాసీ ప్రాంతాన్ని అభివృద్ధివైపు నడిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. 1981 ఇంద్రవెల్లి దారుణంపై ఆనాడే క్షమాపణ చెప్పానని, ఆనాడు సీమాంధ్ర పాలకుల పాలనలో ఆ తప్పు జరిగిందన్నారు రేవంత్ రెడ్డి. అమరవీరుల స్తూపం సాక్షిగా కేసీఆర్ పాలనను అంతం చేశామని, కేసీఆర్ కుటుంబం కోసమే రాష్ట్రం వచ్చిందా? అని ప్రశ్నించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**ఆ కృతజ్ఞతతోనే కాంగ్రెస్‌ను గెలిపించారు..**

ఇంద్రవెల్లి వేదికగా పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం రేవంత్ రెడ్డి.. అమరవీరుల ఆశయాలను కాంగ్రెస్ పూర్తి చేసిందన్నారు. చెప్పిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని అన్నారు. ఆ కృతజ్ఞతతోనే తెలంగాణ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా చర్యలు తీసుకుంటామని,




అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పారు. జల్, జమీన్, జంగల్ నినాదంతో కొమురంభీమ్ పోరాటం చేశారని, ఆ స్ఫూర్తితోనే తాము పని చేస్తామన్నారు. ఇంద్రవెల్లి గాలి, నీటిలో పౌరుషం ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు ఈ ప్రాంతానికి ఎప్పుడైనా వచ్చావా అని కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని పడగొడుతా అంటున్నారు.. 'ఎవ్వడ్రా వచ్చేది.. ప్రజల ప్రభుత్వం తమది ప్రజా ప్రభుత్వం' అని అన్నారు. కాళేశ్వరం గాలికి పోయింది.. నువ్వు నీ ఖానదాన్ వచ్చినా ఏం చేయలేరని మండిపడ్డారు. జన్మలో మళ్లీ కేసీఆర్ సీఎం కాలేడని విమర్శించారు. మతం పేరుతో ఒకరు.. మద్యం పేరుతో మరొరు వస్తారు.. ప్రతీ తండా, గూడెంలో రోడ్లు వేసే బాధ్యత తమదని సీఎం తెలిపారు. రాహుల్ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**నాగోబా ఆలయ అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి షురూ**

**– ఇంద్రవెల్లి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** ధరణి మూలంగా భూములు కోల్పోయిన గోండు గిరిజనులకు తిరిగి ఆ భూములను అప్పగిస్తామని ఇంద్రవెల్లి సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పోరాట యోధులు, అమరుల ఆలోచనలను ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని అందుకు గాను ఇటీవల రెండు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కళాకారులకు అందించే నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను అందిస్తామని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తామని ఇంద్రవెల్లి అమరుల స్థూపంగా సాక్షిగా ప్రమాణం చేశాం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇదే అమరుల స్తూపం సాక్షిగా నాగోబా దేవాలయం అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. నేటి ఇంద్రవల్లి సభ సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు అని అన్నారు. కోరి తెచ్చుకున్న తెలంగాణ కొద్దిమంది చేతుల్లో బంధీ కాగా.. తాము అధికారంలోకి వస్తే మీ కష్టాలు తీరుస్తాం అని ఇదే ఆదిలాబాద్ జిల్లాలో ప్రకటించామన్నారు.

మీ అందరి ఆశీస్సులతో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందన్నారు. ఇచ్చిన మాట మరవకుండా వంశస్తుల నాగోబా దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అమరుల స్తూపం సాక్షిగా ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తామన్నారు. గోండుల జీవితాల్లో మార్పు రావాలని గద్దర్ తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తాను పాదయాత్ర మొదలుపెట్టిన రోజు అమరుల స్తూపం వద్ద గద్దర్ ప్రమాణం చేయించారని గుర్తు చేసుకున్నారు. గోండుల జీవితాల్లో మార్పు కోసం తాను పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్రను ఇంద్రవెల్లి నుంచే ప్రారంభించిన సంఘటనను బట్టి విక్రమార్క మరోసారి చేసుకున్నారు. ఐటీడీఏల పునరుద్ధరణ, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఆర్థిక సాయం పెంచడం, త్రివేణి సంగమం అభివృద్ధి, చిహ్మాన్ ప్రాజెక్టును పూర్తి చేయాలని నాడు గద్దర్ కోరారు. ఈ పనులన్నీటిని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని చెప్పారు. ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు.

# ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు 'పల్లెకు పోదాం'

**మొదటిపేజీ తరువాయి**

గంటలు ఉంటారు.. అక్కడ ప్రజలతో మమేకం అవుతారని డీకే అరుణ తెలిపారు. మరోవైపు.. తెలంగాణ నుండి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు.. ఈ నెల 5 నుండి బస్సు యాత్ర నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఫిబ్రవరి 18 నుంచి 24 వరకు నారీ శక్తి వందన్ కార్యక్రమం.. కేంద్ర ప్రభుత్వ లబ్దిదారుల సమ్మేళనాలు.. ప్రతి పార్లమెంట్, అసెంబ్లీలో ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు లాంటివి నిర్ణయించామని తెలిపారు. కేసీఆర్ ను ఓడించాలని ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ కు ఓటు వేశారని డీకే అరుణ తెలిపారు. కేసీఆర్ అవినీతి, కక్ష సాధింపులకు వ్యతిరేకంగా ఓటు వేశారని అన్నారు. ఎన్నికల్లో భాగంగా.. బీజేపీ పై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలలో హామీలు ఎక్కువగా ఉన్నాయి.. ఇచ్చిన హామీలు తప్పించుకోవడం కోసం అప్పులు ఉన్నాయని ఈరోజే తెలిసినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతుందని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికలు వెంటనే ఎందుకు పెట్టడం లేదు.. గెలుస్తామని ధీమా లేకపోవడమే ఎన్నికలు పెట్టడం లేదని విమర్శించారు. సర్పంచ్ లకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు మీరిచ్చిన 6 గ్యారంటీలకు ఏమీ సంబంధమని కాంగ్రెస్ ను ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు అట.. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తారా అని మండిపడ్డారు. తెలంగాణలో 17 సీట్లు గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారని మాయ మాటలు చెబుతున్నారని తెలిపారు. కేసీఆర్ లాగానే కాంగ్రెస్ వాళ్లు వ్యవహరిస్తున్నారు.. ఇద్దరికీ తేడా లేదని దుయ్యబట్టారు. బీజేపీ ఎక్కువ స్థానాలు గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి అవుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ప్రధాని దగ్గరికి వెళ్లి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరి.. ఇక్కడకి వచ్చి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణలో బీజేపీ 10 నుండి 12 స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.



# బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సర్వనాశనం

ఖర్చు చేసి సాగునీరు అందించి తీరుతామని మంత్రి వెల్లడించారు.

**ఏడుసార్లు గెలిచిన ఇంత ఆనందం ఎప్పుడూ చూడలే..**

గత 30 ఏండ్లుగా రాజకీయంలో ఉంటూ ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన.. కానీ ఇప్పుడు పొందుతున్నంత ఆనందం ఎప్పుడు పొందలేదు అని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చెప్పారు. పార్టీ నుండి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత కష్టపడ్డారో.. అంతకుమించి పార్టీ నాయకులు కార్యకర్తలు తమ చెమటను, రక్తాలను చిందించి పార్టీని అధికారంలోకి తెచ్చారని చెప్పారు. పార్టీకి ఓట్లు వేసిన వారు.. వెయ్యని వారు, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పంచుకునేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

వంశీచందర్ రెడ్డిని గెలిపించండి

వచ్చే పార్లమెంటు ఎన్నికలలో మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం నుండి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి పోటీ చేయనున్నారు. మేము అందరము ఆయన పేరుని సూచిస్తున్నాం. కష్టపడే స్వభావం ఉన్న వంశీచందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు గాను 12 స్థానాలను గెలిపించారు. ఇది సాధారణ విషయం కాదు. ఆ స్ఫూర్తితోనే వంశీచందర్ రెడ్డిని గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**ఎంపీ ఎన్నికల్లో గెలవాలి: వంశీచందర్ రెడ్డి**

గత అసెంబ్లీ ఎన్నికలలో బానిస సంకెళ్లు తెంచారు. అదే స్ఫూర్తిని కొనసాగించి వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో గెలుద్దాం అని వంశీచందర్ రెడ్డి అన్నారు. 2019లో పాలమూరు పార్లమెంటు స్థానానికి పోటీ చేశాను. అప్పుడు మన ఎమ్మెల్యేలు ఒక్కరు లేకపోయినా.. నాయకులు కార్యకర్తలు అందరూ పోరాటాలు చేశారు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గం లోనూ మన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉత్సాహంగా పనిచేస్తే ఎంపీని గెలిపించుకోవడం చాలా సులభం అవుతుందని చెప్పారు. పాదయాత్రకు మక్తల్ నియోజకవర్గంలో అడుగడుగునా మంచి స్పందన వచ్చింది.. మీ అందరికీ కృతజ్ఞతలు అని వంశీచందర్ రెడ్డి తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేద్ ఉల్లా కొత్వాల్, నారాయణ పేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే. నాగరాజు గౌడ్, ఆంజనేయులు గౌడ్, అమరచింత, ఆత్మకూర్ మండలాల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ ఎన్నికల్లో ఏ పార్టీతో కలవాల్సిన అవసరం లేదు

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు. చేరికలకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ కి ఓటేశారన్నారు. ఇక్కడ కాంగ్రెస్ గెలవలేదని, బీఆర్ఎస్ మాత్రమే ఓడిపోయిందని చెప్పారు. కాంగ్రెస్ గెలిచినా సమస్యలు పరిష్కారం కావని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ బ్లాక్ మెయిలింగ్ పాలిటిక్స్ చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. భూములకు సంబంధించిన లావాదేవీలపై బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు డబ్బులు సమకూర్చడానికి బిల్డర్స్, భూ వ్యాపారులను బెదిరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు. బిల్డర్లు, వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. కాంగ్రెస్ అవినీతి కార్యక్రమాలను అడ్డుకోవాలని, ప్రజలను చైతన్యం చేయాలని కిషన్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని, ఆ రెండు పార్టీలను ఒక్కటిగానే చూడాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన అవినీతి మంత్రులపై అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి చెప్పారని, మరి ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని, ఎలాంటి రోడ్డు మ్యాప్ కూడా లేదన్నారు. ఇచ్చిన హామీల అమలుపై క్లారిటీ ఇవ్వడం లేదని ఫైరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల వరకు కాంగ్రెస్ కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు.

**కాంగ్రెస్ యువతను మోసం చేసింది**

ప్రజలను మోసం చేయడంలో ఘనమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ మరోసారి తెలంగాణ యువతను మోసం చేసిందని.. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శలు చేశారు. 'ఎన్నికల వాగ్దానంలో భాగంగా.. ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ నిరుద్యోగ యువతకోసం కోసం గ్రూప్1 నోటిఫికేషన్ వేస్తామని.. వార్తాపత్రికల మొదటిపేజీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని, మరి ఇంతవరకు నోటిఫికేషన్ ఎందకు వేయలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఉద్యోగాలివ్వలేదని ఆ పార్టీని కాదని, కాంగ్రెస్ ను నమ్మి ఓటేసిన తెలంగాణ యువతను నిట్టనిలువునా మోసం చేసిందని ఫైరయ్యారు. యువతను మోసం చేసినట్లే.. ఇతర వాగ్ధానాలనూ వ్యూహాత్మకంగా దాటవేసే ప్రయత్నం జరుగుతోందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.



# ఇంటిపైనే కూలిన విమానం.. పూర్తిగా కాలిపోయిన ఇల్లు

అమెరికాలోని ఫ్లోరిడాలో విషాదం చోటుచేసుకుంది. ఏకంగా ఓ ఇంటిపైనే చిన్న విమానం కూలిపోవడం కలకలం రేపింది. ఆ ఇల్లు పూర్తిగా దగ్ధమైపోగా.. మరో మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ దుర్ఘటనలో పైలట్ తో పాటు విమాన ప్రయాణికులు, ఆ ఇంట్లో ఉన్న వారితో కలిసి మృతులు సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారులు ఇంకా మృతుల సంఖ్యను అధికారికంగా ప్రకటించలేదు. సమాచారం మేరకు ఘటనాస్థలంలోకి చేరుకున్న అగ్నమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ప్రమాదానికి సంబంధించి క్లియర్ వాటర్ ఫైర్ అండ్ రెస్క్యూ విభాగం తమ ఎక్స్ (ట్విట్టర్)లో వీడియో షర్ చేసింది. ఈ వీడియోలో విమానం కూలిన ప్రదేశంలో మంటలు వ్యాపించడం అలాగే విమానానికి సంబంధించిన అవశేషాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మేము ప్రమాద స్థలం వద్దే ఉన్నామని.. ఇళ్లు దగ్ధమయ్యాయని.. వివిధ ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారని అధికారులు చెప్పారు. అయితే ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తెలిపిన వివరాల ప్రకారం చూసుకుంటే.. బీచ్‌క్రాఫ్ట్ బొనాంజా వి35 అనే విమానం కూలే ముందు పైలెట్ ఇంజిన్‌లో జరిగిని వైఫల్యాన్ని గుర్తించి సమీపంలో ఉన్న విమానశ్రయానికి సమాచారం అందించాడు. కానీ మొబైల్ హోం పార్క్ సమీపంలో రన్‌వేకి 5 కిలోమీటర్ల దూరంలో ఫ్లైట్ రాడర్ నుంచి విడిపోయినట్లు అగ్నిమాపక చీఫ్ ఎహ్లర్స్ పేర్కొన్నారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సెఫ్టీ బోర్ట్ దర్యాప్తు చేస్తోంది.


విశాలభారతి
తెలుగు దిన పత్రిక
AP NEWS
ఆంధ్రప్రదేశ్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com


# కేంద్రానికి గులాంగిరి చేస్తున్న సీఎం జగన్

- **ఢిల్లీ వేదికగా షర్మిల దీక్ష**
- **విభజన హామీలు అమలు చేయాలి**
- **సీఎం జగన్, ప్రధాని మోదీపై విమర్శలు**

**ఆంధ్రప్రదేశ్, విశాల భారతి:** రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ ఢిల్లీలోని ఏపీ భవన్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి దీక్ష చేశారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా కొనసాగిస్తామని తిరుపతి వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ హామీ ని లబెట్టుకోవాలన్నారు. విభజన చట్టంలోని హామీలను ఇప్పటి వరకు ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సీఎం జగన్ బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. ఏపీ ప్రజలను మోదీకి బానిసలుగా చేసే ప్రయత్నం జరుగుతోందన్న షర్మిల.. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట తప్పితే ద్రోహం చేసిన వారు అవుతారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అయినప్పటికీ అన్ని అంశాల్లో బీజేపీ సర్కార్‌కు వైసీపీ మద్దతు ప్రకటిస్తున్నారని ధ్వజమెత్తారు. మీ మధ్య ఉన్న ఒప్పందం ఏమిటో బయటపెట్టాలి అన్నారు. దుగరాజపట్నం పోర్టు నిర్మిస్తామని, సీమాంధ్రను స్వర్ణాంధ్ర తీర్చుదిద్దుతామని ప్రధాని మోదీ హామి ఇచ్చారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని ఏపీ ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నానన్నారు. ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయిందన్న షర్మిలా, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మాయమాటలు చెప్పి తప్పించుకుంటున్నారని ధ్వజమెత్తారు.





# వైసీపీ 6వ జాబితా విడుదల

- **జాబితాను విడుదల చేసిన మంత్రి మెరుగ**
- **నాలుగు ఎంపీ, ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఇన్‌ఛార్జ్‌లను ప్రకటన**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వైసీపి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఆరవ జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలో అటు అసెంబ్లీ, ఇటు లోక్ సభ ఎన్నికల వేడి మొదలైంది. అన్ని పార్టీలు ఎన్నికల రణరంగంలో గెలుపుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార వైఎస్ఆర్సీపీ తన అభ్యర్థులను విడతల వారీగా ప్రకటించుకుంటూ ముందుకుసాగుతోంది. వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు చేర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఆరో జాబితా మంత్రి మేరుగ నాగార్జున విడుదల చేశారు. నాలుగు ఎంపీ, ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించారు. రాజమండ్రి నుంచి గూడూరి శ్రీనివాస్, నర్సాపురం గూడూరి ఉమాబాల, గుంటూరు ఉమ్మారెడ్డి రమణ, చిత్తూరు ఎంపీ స్థానంలో రెడ్డప్పను ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. ఇక అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే.. గిద్దలూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌గా నాగార్జునరెడ్డి, ఎమ్మిగనూరు బుట్టా రేణుక, జీడీ నెల్లూరు నారాయణస్వామి, మైలవరం నుంచి తిరుపతిరావు, నెల్లూరు సిటీ నుండి ఎండీ ఖలీల్, మార్కాపురం అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌గా అన్నా రాంబాబుల పేర్లను ప్రకటించారు. తొలి జాబితాలో 11 నియోజకవర్గాలకు, రెండో జాబితాలో మరో 27 స్థానాలకు, మూడో జాబితాలో 21 నియోజకవర్గాలకు, నాలుగో జాబితాలో ఎనిమిది స్థానాలను, ఐదవ జాబితాలో నాలుగు ఎంపీ స్థానాలకు, మూడు ఎమ్మెల్యే నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను మారుస్తూ వారి పేర్లను ప్రకటించింది. ఆరవ జాబితాలో మొత్తం 10 మంది సమన్వయకర్తలను ప్రకటించింది.



# వైసీపీలో ఫ్లెక్సీల గోల

- **చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫోటోలు చించివేత**
- **వైసీపీ కార్యాలయం సమీపంలో ఘటగ**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఒంగోలులో వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించేయడంతో కలకలం రేగింది. మంత్రి మేరుగు నాగార్జున క్యాంపు కార్యాలయం దగ్గర రోడ్డుపై ఇతర వైసీపీ నాయకులతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫోటోలతో ఫ్లెక్సీలను మంత్రి నాగార్జున అనుచరులు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో ఉన్న చెవిరెడ్డి ఫోటోలను మాత్రమే దుండగులు చించేయడం ఒంగోలు వైసీపీలో చర్చకు దారి తీసింది. చెవిరెడ్డి ఫ్లెక్సీ ని చించి కింద పడేయడమే కాకుండా వాటిని తగులబెట్టారు. ఇదంతా వైసీపీ పార్టీ జిల్లా కార్యాలయం పక్కనే రోడ్డుపై జరిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. చెవిరెడ్డి ఫ్లెక్సీ లను చించివేశారన్న సమాచారం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన మంత్రి మేరుగు నాగార్జున జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తన క్యాంప్ కార్యాలయం దగ్గర చెవిరెడ్డి ఫ్లెక్సీలను చించలేదని, ఎక్కడో రోడ్డుపైన చించివేశారని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనికి, తనకు సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులు ఉన్నాయని, ఒంగోలులో తనకు బాలినేనే నాయకుడని, ఆయన ఆశీస్సులతోనే పనిచేసుకుంటున్నామని, ఏదిఏమైనా బాలినేనే మా నాయకుడు అంటూ మంత్రి మేరుగు నాగార్జున పదేపదే ఆందోళనతో సమాధానం చెప్పడం విశేషం.ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు, నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కందుకూరు, కావలి నియోజకవర్గాలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని రీజనల్ కో ఆర్డినేటర్‌గా వైసీపీ అధిష్టానం నియమించింది. రెండు రోజుల్లో చెవిరెడ్డి ఒంగోలుకు వచ్చి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. మరోవైపు ప్రకాశం రీజనల్ కో ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియామకాన్ని వ్యతిరేకిస్తున్న బాలినేని రెండు రోజులుగా హైదరాబాద్‌లోనే మకాం వేశారు. వైసీపీ అధిష్టానం నిర్ణయంతో అసంతృప్తికి గురైన బాలినేని హైదరాబాద్ వెళ్ళినట్టు సమాచారం. ఈ సమయంలో చెవిరెడ్డిని రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమించడంతో ఆయన ఒంగోలు వచ్చి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఒంగోలులో జిల్లా పార్టీ కార్యాలయం సమీపంలోని సంతనూతలపాడు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి నాగార్జున క్యాంప్ కార్యాలయం ఉంది. దీంతో ఇక్కడ రోడ్డుపై వైసీపీ నాయకులతో పాటు చెవిరెడ్డి ఫోటోలను కూడా ముంద్రించిన ఫ్లెక్సీలను మంత్రి నాగార్జున అనుచరులు ఏర్పాటు చేశారు. అందరికన్నా పైభాగంలో చెవిరెడ్డి ఫోటోలు వేసి బాలినేని, ఇతర నాయకుల ఫోటోలను కింద వేశారు. ఇదే రచ్చకు దారి తీసింది.

# ఏపీ ఎన్నికల్లో కొండా సురేఖ ఎంట్రీ..!

- **ఏపీ ఎన్నికల్లో కొండా సురేఖ ఎంట్రీ..!**



ఆంధ్రప్రదేశ్, విశాలభారతి: రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. కాగా.. ఏపీ రాజకీయాలపై తెలంగాణ నేతలు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. మొన్నటివరకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో తెలంగాణలో విస్తృతంగా పాదయాత్ర చేసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన వైఎస్ షర్మిల ఇప్పుడు ఏపీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఏపీపీసీసీగా బాధ్యతలు స్వీకరించి తన అన్న వైఎస్ జగన్‌పై ఘాటు విమర్శలు చేస్తూ రాజకీయాన్ని రసవత్తరంగా మార్చేశారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ కుటుంబంతో సత్సంబంధాలు ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఇప్పుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ వైఎసీపీ తరుపున జగన్ తరపున విస్తృత ప్రచారం నిర్వహించిన సురేఖ ఇప్పుడు ఏపీకి వెళ్లి ఆయనకు వ్యతిరేఖంగా ప్రచారం చేసేందుకు సిద్ధం అంటున్నారు. ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయని ఆ ఎన్నికల ప్రచారానికి తాను వెళ్తానని కొండా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తానని చెప్పుకొచ్చారు. ఏపీ ఎన్నికల షెడ్యూల్ రాగానే తప్పకుండా వెళ్తానన్నారు. తాను ఇప్పుడు వైసీపీలో లేనన్న విషయాన్ని సురేఖ గుర్తు చేశారు. ఏపీలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.



# గవర్నర్ ను కలిసిన కోడికత్తి శ్రీను తల్లి

- **కోడికత్తి శ్రీను కుటుంబానికి అండగా దళిత, ప్రజా సంఘాలు**
- **సీఎం జగన్ సాక్ష్యం చెబితే తమ బిడ్డ బయటికి వస్తాడు**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** కోడికత్తి కేసులో గత ఐదేళ్లుగా జైల్లో ఉన్న నిందితుడు జనుపల్లి శ్రీను విడుదల కోసం అతడి కుటుంబ సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇవాళ కోడికత్తి శ్రీను తల్లి, సోదరుడు విజయవాడలో రాజ్ భవన్ కు వచ్చారు. కోడికత్తి కేసులో తమకు న్యాయం చేయాలంటూ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసులో ముఖ్యమంత్రి జగన్ కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పేలా చూడాలని గవర్నర్ ను కోరినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి సాక్ష్యం చెబితే శ్రీను బయటికి వస్తాడని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కోడికత్తి శ్రీను కుటుంబానికి దళిత సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు అండగా నిలిచాయి. గవర్నర్ ను కలిసిన వారిలో సమతా సైనిక్ దళ్, అఖిలపక్ష నేతలు కూడా ఉన్నారు. కోడికత్తి కేసులో జగన్ సాక్ష్యం చెప్పకుండా జాప్యం చేస్తుండడంతో, శ్రీను జైల్లోనే మగ్గిపోతున్నాడని వారు గవర్నర్ కు వివరించారు.



# షర్మిల చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతుంది : రోజా

- **షర్మిల చేస్తున్నది ప్రజలు గమనిస్తున్నారు**
- **చంద్రబాబుకు అభ్యర్థులు దొరకడం లేదు**
- **షర్మిల చెప్పేవన్నీ అబద్ధాలే**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై ఏపీ మంత్రి రోజా మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. షర్మిల కప్పుకున్నది కాంగ్రెస్ కండువా అని... కానీ ఆమె చదివే స్క్రిప్ట్ మాత్రం చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. కుటుంబాలను చీల్చడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. చంద్రబాబు మూడు సార్లు సీఎంగా చేశారని అయినప్పటికీ, మేనిఫెస్టోలో పెట్టిన వాటిని అమలు చేశామని చెప్పే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. నాడు ఎన్టీఆర్ కుటుంబాన్ని చీల్చిన చంద్రబాబు. ఈరోజు సీఎం జగన్ కుటుంబం వరకు వచ్చారని రోజా దుయ్యబట్టారు. ఎన్నికల్లో పోటీ చేయించేందుకు చంద్రబాబుకు అభ్యర్థులు దొరకడం లేదని అందుకే వైసీపీ నుంచి తరిమేసిన నేతలను టీడీపీలోకి తీసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో పార్టీ పెట్టుకున్న షర్మిల ఇప్పుడు ఏపీలో టీడీపీ, జనసేనల కోసం ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని రోజా అన్నారు. ఏపీకి వచ్చిన షర్మిల అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. తన నగరి నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటున్న విపక్ష నేతలు నగరికి వచ్చి చూస్తే తాము చేసిన అభివృద్ధి ఏమిటో తెలుస్తుందని అన్నారు.

# నన్ను చంపుతానని బెదిరిస్తున్నారు

- **పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్ సునీత**
- **చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి**



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కూతురు సునీత తనకు ప్రాణహాని ఉందని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను చంపుతామంటూ ఫేస్ బుక్ వేదికగా బెదిరిస్తున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. లేపేస్తాం అనే విధంగా పోస్టులు పెడుతున్నారని తెలిపారు. తనపై బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు సైబర్ క్రైమ్ డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ, సునీత తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల ఆధారంగా ఫిర్యాదు చేశారని చెప్పారు. బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# వచ్చే ఎన్నికల్లో నాకు సీట్ ఇవ్వండి ప్లీజ్

- **రాబోయే ఎన్నికలపై జలీల్ ఖాన్ కీలక వ్యాఖ్యలు**
- **విజయవాడ పశ్చిమ సీటు ఇవ్వండి**
- **జలీల్ ఖాన్ కు మద్దతుగా ర్యాలీ**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాబోయే ఎన్నికలపై మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మైనార్టీలు అందరూ తనకు సీటు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. విజయవాడ పశ్చిమ సీటు టీడీపీ గెలిచే సీటు అని చెప్పారు. ఇతర వర్గాలు ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని జలీల్ ఖాన్ తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ టికెట్‌ను జలీల్ ఖాన్‌కే ఇవ్వాలంటూ ముస్లిం సంఘాలు శుక్రవారం నాడు బారీగా ర్యాలీ తీశాయి. ముస్లింలు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గ సీటును జలీల్ ఖాన్‌కు ఇవ్వడం ద్వారా ఏపీ వ్యాప్తంగా మైనార్టీల్లో ప్రభావం ఉంటుందని ముస్లిం సంఘాలు తెలిపాయి. తనకు మద్దతుగా చేపట్టిన ర్యాలీలో జలీల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలీల్ ఖాన్ మాట్లాడుతూ.. తమకు ఈ సీటే కీలకమని ముస్లింల సెంటిమెంట్‌ను కూడా పార్టీ హై కమాండ్ గుర్తించాలని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లను కూడా కలిసి ఈ సీటును తనకే కేటాయించాలని విన్నవించినట్లు తెలిపారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గాన్ని తాను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తనకు సీటు ఇస్తే భారీ మెజార్టీతో తప్పకుండా గెలుస్తానని అన్నారు. వైసీపీ ముస్లింలకు ఇచ్చారు కాబట్టి టీడీపీ కూడా తనకే కేటాయించాలని కోరారు. పొత్తులో జనసేనకు సీటు ఇస్తే వాళ్లు గెలవాలి కదా అని ప్రశ్నించారు. ఇక్కడ మెజార్టీ భాగం ముస్లింలే ఉన్నారని వివరించారు. తనకు తప్పకుండా సీటు ఇస్తారని, ఇవ్వాలని కోరుతున్నానని అన్నారు.



# జగనన్న విడిచిన బాణం ఏమైంది..?

- **టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య**
- **జగన్ రూ.43 వేల కోట్లు దోచుకున్నారు**
- **- జగనన్న బాణం ఎందుకు ఎదురుతిరిగింది**

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి :** సీఎం జగన్‌ది విచిత్రమైన మనస్తత్వమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. జగనన్న విడిచిన బాణం నేడు ఏమైంది. నేడు ఎందుకు ఎదురు తిరిగిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, పత్రికలు, ప్రజా, కుల సంఘాలు, హేతువాదులు అడిగిన ప్రశ్నలకు జగన్ ఏనాడూ సమాధానం చెప్పలేదని నిలదీశారు. శుక్రవారం నాడు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ రూ.43 వేల కోట్లు దోచుకున్నారని సీబీఐ జగన్‌పై 11 ఛార్జిషీట్లు వేసిందన్నారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిత్వాన్ని అడ్డం పెట్టుకొని రూ.43 వేల కోట్లు కొట్టేసినట్లు సీబీఐ చెప్పకనే చెప్పిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ 5 కేసులు నమోదు చేసి ఛార్జిషీట్లు వేశారని రూ.2 వేల కోట్ల పైచిలుకు ఆస్తులు స్వాధీనపరచుకున్నారని అన్నారు. 2004లో జగన్ తండ్రి వైఎస్సార్ ముఖ్యమంత్రి కాకముందు ఆయన ఆస్తులు 2.12 కోట్లు కాదా అని వర్లరామయ్య ప్రశ్నించారు. 2009 ఎన్నికల అఫిడవిట్ లో తన ఆస్తి రూ.77 కోట్ల 40 లక్షలకు ఎలా ఎగబాకింది. నాలుగు సంవత్సరాల్లో ఇది అనితర సాధ్యమా అని ఏ ప్రశ్నలకు మీరేందుకు సమాధానం చెప్పరు. మౌనం అర్ధాంగికారమా ఇలాంటి ముఖ్యమంత్రి మనకు అవసరమా నేనడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే ప్రజాక్షేత్రంలో మీరు తప్పుడు మనిషిగా అతి కొద్ది కాలంలోనే మీరు దేశంలోనే అత్యంత ధనవంతుడిగా ఎలా రూపాంతరం చెందారు. లోటస్ పాండ్ మీదా కాదా మీదైతే మీకెక్కడిది .29 ఎకరాల్లో అమెరికా శ్వేత సౌధాన్ని తలదన్నే సౌదాన్ని బెంగళూరులో మీరు ఎలా నిర్మించగలిగారు. మీ బాబాయి వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ అడిగిన మీరు, తర్వాత హైకోర్టు నుంచి దానిని ఎందుకు వెనక్కి తీసుకున్నారు. కోడికత్తి శీనును మీ కుట్రలో పావుగా వాడుకొని 5 ఏళ్లుగా రిమాండ్ ఖైదీగా ఎందుకుంచారో చెప్పగలరా అని వర్ల రామయ్య ప్రశ్నించారు.



# సీఎం జగన్ ఆర్థిక ఉగ్రవాది

- **ఎక్స్ వేదికగా నారా లోకేష్ విమర్శలు**
- **స్మగ్లర్లుగా మారిన రాష్ట్ర పోలీసులు**

**ఆంధ్రప్రదేశ్ , విశాలభారతి:** గంజాయి సరఫరా చేస్తూ రాష్ట్రానికి చెందిన ఇద్దరు పోలీసులు తెలంగాణలో పట్టుబడిన ఘటనపై టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. ఈ సంద్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఆర్థిక ఉగ్రవాది జగన్ పాలకుడు అవడంతో రాష్ట్రంలో వనరులన్నీ దోపిడీకి గురై అరాచకం రాజ్యమేలుతోందని అన్నారు. కొంతమంది పోలీసులు దొంగలు, స్మగ్లర్లు, కిడ్నాపర్లుగా మారుతున్నారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం జగన్ ఖాకీలను ప్రైవేటు ఫ్యాక్షన్ సైన్యంగా వాడటంతో వారికీ నేరాలు అలవాటైపోయాయని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. పాలకులే సీఐడీని కిడ్నాపులు, బెదిరింపులకు వినియోగిస్తున్నారు. తాము ఏం చేసినా అడిగేవారు లేరని పోలీసులు ముఠాలుగా ఏర్పడటం ఆ వ్యవస్థ గౌరవాన్ని మంటగలిపింది. కర్నూలు డీఐజీ ఆఫీస్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సుజన్ ఓ ముఠాని ఏర్పాటు చేసి.. ఏపీ సీఐడీ బృందం పేరుతో ఐటీ కంపెనీ యజమానిని కిడ్నాప్ చేసి హైదరాబాద్‌లో చిక్కిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. తాజాగా 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ హైదరాబాద్ పోలీసులకు చిక్కడం ఏపీలో పోలీసులే గంజాయి స్మగ్లర్లుగా మారిన దుస్థితిని వెల్లడిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు.



# సబ్ కోర్టు మంజూరు పట్ల హర్షం

**కోదాడ, విశాలభారతి:** సబ్ కోర్టును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 62 జారీ చేయడం పట్ల కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తులు శ్యాంసుందర్, భవ్యాలతో కలిసి బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు దేవబత్తిని నాగార్జున మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా న్యాయవాదులు చేస్తున్న కృషికి ఫలితంగా రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల కలను సాకారం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోదాడ నియోజకవర్గంలోని కోదాడ, నడిగూడెం, మునగాల, అనంతగిరి, చిలుకూరు మండలాల పరిధిని సబ్ కోర్టుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, హైకోర్టు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సబ్ కోర్టు ఏర్పాటుతో కక్షిదారులకు సత్వర న్యాయం జరగడంతో పాటు ఖర్చులు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గాలి శ్రీనివాస్ నాయుడు, సెక్రటరీ శరత్ బాబు, జాయింట్ సెక్రటరీ సీతారామరాజు, ట్రెజరర్ పాషా, న్యాయవాదులు రాధాకృష్ణమూర్తి, సుధాకర్ రెడ్డి, పాలేటి నాగేశ్వరరావు, పగడాల రామచంద్ర రెడ్డి, యశ్వంత్, రంగారావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ**

**కోదాడ, విశాలభారతి:** సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొన్ని విషయాల్లో సైబర్ మోసాలకు గురవుతున్నారని వాటిపై వయోవృద్ధులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ తెలిపారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో గూగుల్ సంస్థల సహకారంతో నిర్వహించిన సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ బాధ్యులు శ్యామ్ ప్రొజెక్టర్ ద్వారా ప్రజెంటేషన్ చేస్తూ సైబర్ నేరాలను వివరించారు. నేరగాళ్లు ఎవరికి కనిపించకుండా అనేక మోసాలకు పాల్పడుతుంటారని అంతర్జాలం, సెల్ ఫోన్లు వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆన్లైన్ మోసాలకు గురి కాకుండా భద్రతకు సంబంధించిన బ్రోచర్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ కోదాడ అధ్యక్షులు గడ్డం నరసయ్య, కార్యదర్శి మల్లెంపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కార్యదర్శి హమీద్ ఖాన్, రాష్ట్ర నాయకులు రావెళ్ల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



# నోరు తీపి చేయనున్న మిఠాయి పొట్లం

- మిఠాయి పోట్లం 9వ బ్రాంచ్ ను ప్రారంభించిన పారిశ్రామికవేత్త మీలా మహదేవ్

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రజల నోరు తీపి చేసేందుకు విజయవాడ ప్రజలకు సుపరిచితమైన బాలాజీ స్వీట్స్ వారి ఫ్రాంచేజి మిఠాయి పోట్లం 9వ బ్రాంచ్ ను సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభించుకోవడం హర్షనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్లో మిఠాయి పొట్లం బ్రాంచ్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట ప్రజలకు అన్ని రకాల స్వీట్స్ హోమ్ ఫుడ్స్ ఈ మిఠాయిపోట్లం ద్వారా అందజేయడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిఠాయి పొట్లం నిర్వాహకులు కురివెళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో నాణ్యమైన స్వీట్లు అందజేస్తూ బాలాజీ స్వీట్స్ వారి ఫ్రాచేజ్ మిఠాయి పొట్లం 9వ బ్రాంచ్ ను సూర్యాపేటలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మిఠాయి పట్ల నిర్వాహకులు పాలవరపు శ్రీనివాస్, చారగుండ్ల రవికుమార్, రంగ శ్రీనివాస్, చెరుకూరి యుగేందర్, నాగసాయి నగేష్, దొడ్డ లక్ష్మీనారాయణ, గుర్రం అంకిత, పట్టణ ప్రముఖులు తోట శ్యాంసుందర్, రాచర్ల కమలాకర్, సింగిరికొండ రవీందర్, కక్కిరేని చంద్ర శేఖర్,మిట్టపల్లి రమేష్, మంచాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ లో ఏటిఎం ప్రారంభం

- ఎస్.బి.ఐ ద్వారా మెరుగైన సేవలందాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్.

**సూర్యాపేట, విశాలభారతి:** ఎస్.బి.ఐ ద్వారా ఏర్పాటు చేసిన ఏ.టి.ఎం ద్వారా ఉద్యోగులకు, కలెక్టరేట్ కి వచ్చే ప్రజలకు మెరుగైన సేవాలందలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని జి 2 రూం లో ఏర్పాటు చేసిన ఎస్.బి.ఐ ఏ. టి.ఎం. ను ఏ. జి.ఎం. జ్యోతి లక్ష్మితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడిగిన వెంటనే ఏటీఎం ఏర్పాటు చేసినందుకు ఆర్ ఎం కు బ్యాంకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఏటీఎం ద్వారా కలెక్టరేట్ లో పనిచేసే ఉద్యోగులు అలాగే వివిధ పనుల పై వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సూచించారు. అలాగే త్వరలో ఎస్బిఐ కలెక్టరేట్ బ్రాంచ్ ని కూడా త్వరలో ప్రారంభించనున్నారని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్లోనే వివిధ శాఖల సిబ్బందికి కలెక్టరేట్ సందర్శకులకు ఏటీఎం చాలా ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఎల్ డిఎం బాపూజీ, జిల్లా అధికారులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

- బడ్జెట్ పత్రాలు దగ్ధ
- నిరసన వ్యక్తం చేసిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం




**సూర్యాపేట, విశాలభారతి:** గ్రామీణ వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు బడ్జెట్ కేటాయింపులో చవతి తల్లి ప్రేమ చూపించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్ లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావాలని గ్రామీణ ఉపాధి హామీ పనులను పట్టణ ప్రాంతాల విస్తరణకు వందరోజుల పనిని రెండు వందల రోజులకు పెంచి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వడం కోసం అదనపు నిధులను కేటాయించాలని కోరుతున్న డిమాండ్ ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రతిపాదించిన సీతారామన్ రైతులకు పేదల పెన్షన్లు, రేషన్ షాపుల కిచ్చి సబ్సిడీ ఆహార ధాన్యాలను తగ్గించడం సిగ్గుచేటని విమర్శించారు. పెరుగుతున్న ధరలను నియంత్రణ చేయకుండా పెరిగే ధరల కనుగొనగా కనీస వేతనాలను రివైజ్ చేసి పెంచకుండా ఏ విధంగా ఆర్థిక సామాజిక అసమానతులను రూపుమాపుతారో వివరణ ఇవ్వాలనికేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిపులుసు సత్యం, కెవిపిఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి కోట గోపి, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎలుగురి గోవింద్, పట్నం డెవలప్మెంట్ జిల్లా కన్వీనర్ జె, నరసింహారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కలలు సార్ధకం కావాలంటే కష్టపడి చదవాలి

**కోదాడ, విశాలభారతి:** సహ పాఠ్య కార్యక్రమాలతో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలుగుతుందని, కలలు సాకారం కావాలంటే కష్టపడి చదవాలి అని అనంతగిరి మండలం గొండ్రియాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ అన్నారు. శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వయం పరిపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. చిన్నారులు స్వయం పరిపాలన దినోత్సవంలో ధరించిన పాత్రలు నిజజీవితంలో సార్ధకం చేసుకోవాలంటే కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు , వారానికి మూడు గుడ్లతో పౌష్టికాహారం, ఉదయం అల్పాహారం అందిస్తుందన్నారు. తరగతి గదిలో చిన్నారులు ఉపాధ్యాయుల అధికారుల వేషాధారణలో పాఠాలు బోధించి అలరించారు. చిన్నారులు ముస్తాబైన తీరు చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్, మల్లికార్జున రావు, రావెళ్ల శ్రీనివాసరావు, ఐఈఆర్టీ ఓంకారం, వాలంటీర్ సుష్మా తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అధికారికి సన్మానం

**దేవరుప్పుల, విశాలభారతి:** సింగరాజుపల్లి గ్రామానికి ప్రత్యేక అధికారిగా వచ్చిన సింధు ప్రియను సన్మానించి అభినందనలు తెలిపిన గ్రామస్తులు.ఈ సందర్భంగా సింధు ప్రియ మాట్లాడుతూనేటి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక పాలన ఇకనుంచి ప్రత్యేక అధికారులచే కొనసాగనుందని,జిల్లాలోని 281 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఉత్తర్వులు జారీ చేశారని, ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి గెజిటెడ్ అధికారులకే పంచాయతీ పాలన బాధ్యతలు అప్పగించారని,గురువారంతో పంచాయతీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిందని,ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామపంచాయతీ కార్యాలయాలలో బాధ్యతలను శుక్రవారం స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మెన్ లింగాల రమేశ్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.



# పద్మశ్రీ సమ్మయ్యను సన్మానించిన మందకృష్ణ మాదిగ

**దేవరుప్పుల విశాల భారతి:** అప్పిరెడ్డిపల్లి గ్రామంలో చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి సమ్మయ్యను శాలువాతో మంద కృష్ణ మాదిగ పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు .వారితో పాటు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నరసింహ,ఎమ్మార్పీఎస్ నాయకులు,తదితరులున్నారు.

# ఈ నెల 4 న చెస్ టోర్నమెంట్

**గండూరి కృపాకర్**



**సూర్యాపేట, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారం తో సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆద్వర్యంలో స్థానిక కిరాణ మర్చంట్ అసోసియేషన్ హాల్, తాళ్లగడ్డ, సూర్యాపేటలో ఈ నెల 4 న ఆదివారం నాడు జరిగే ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్ అండర్ 9,11,13,15. బాయ్స్ అండ్ గర్ల్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్. సతీష్కుమార్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు ఆదివారం ఉదయం 10 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు యల్. సతీష్కుమార్ సెల్ : 8555008996, 9394753343 సంప్రదించాలని కోరారు.

# బాలల రక్షణకోసం నిరంతర తనిఖీలు

- బాలలను వెట్టిచాకిరికి గురిచేస్తే చర్యలు తప్పవు
- బాలల వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
- రాహుల్ హెగ్డే ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట



**సూర్యాపేట, విశాలభారతి :** జిల్లాలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్ట్మెంట్ ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పగడ్బందిగా నిర్వహించామని జిల్లా జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ శుక్రవారం తెలిపినారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీ గురవుతున్న 182 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సమరక్షులకు క్షేమంగా అప్పగించడం జరిగినదని అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు బాలురులు 85 మంది, బాలికలు 11 మంది ఉన్నారు అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు బాలురు 65 మంది బాలికలు 21 మంది ఉన్నారు అని ఎస్పీ గారు తెలిపినారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరినీ గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగినది అన్నారు. ఆపరేషన్ స్మైల్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని చేరేలా సిబ్బంది అందరూ బాగా పని చేశారు, భాలల రక్షణలో తనిఖీలు నిరంతరంగా నిర్వహిస్తామని అన్నారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి అని కోరినారు. వెట్టిచాకిరి గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలలకు విద్య యొక్క గొప్పతనాన్ని, అవసరాన్ని వివరించి వారిని చదువుకునే విధంగా ప్రోత్సహించాలి.రెస్క్యూ ఆపరేషన్స్ ద్వారా 182 మంది పిల్లలను గుర్తించడం పని చేసిన పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది అందరినీ అభినందిస్తున్నాను అని ఎస్పి తెలిపినారు.



# సుఖ సంతోషాలతో ఉండాలి

**జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమ నరసయ్య**

**సూర్యాపేట, విశాలభారతి:** శ్రీ సంతోషి మాత అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమ నరసయ్య తెలిపారు. శుక్రవారం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు వంశీకృష్ణ శర్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలతో పాటు బ్రాహ్మణ ఆశీర్వ వచనం అందజేశారు. అంతకుముందు అమ్మవారికి పూలదండలు, పట్టుచీరలు, రవికలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం వేళ జరుగు మహా హారతిలో పాల్గొని కుంభ హారతి ని భక్తులకు స్వయంగా అందజేశారు. దేవాలయంలో జరుగు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో పవిత్రమైనదని గతంలో అయోధ్య మందిర ప్రతిష్ట సందర్భంగా అమర్నాథ్ సేవా సమితికి 200 క్వింటాల బియ్యాన్ని అందజేసినట్లు తెలిపారు. శ్రీ సంతోషి మాత దేవాలయంలో జరుగు అన్న ప్రసాద కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేసి, ఎల్లప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు భేలిదే అశోక్, దేవరశెట్టి సోమయ్య ,పాలవరపు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఇసుక రవాణాపై చట్టపరమైన చర్యలు

**భద్రాచలం, విశాలభారతి:** ఇది దొంగల రాజ్యం దోపిడి రాజ్యం అన్న విధంగా భద్రాచలం పట్టణంలో ఆంధ్రాలోని ఎటపాక గోదారి ఇసుక అలాగే కొల్లుగూడెం పరిసర ప్రాంతాల గోదారి ఇసుక యదేచ్చగా రాత్రికి రాత్రి ట్రాక్టర్ల పై దొంగతనంగా గుట్టు చప్పుడు కాకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. ఆంధ్ర తెలంగాణ ప్రభుత్వాలు ఇసుక రీచులు ఏర్పాటు చేయకపోవడంతో వివిధ కాలనీలోకి దొంగ ఇసుకను ట్రాక్టర్లతో తీసుకొచ్చి ఇల్లు కట్టుకొనే యజమానుల దగ్గర పోస్టు మాకేం తెలవదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కాలనీ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అక్రమంగా తోలుతున్న ఇసుక వ్యాపారులు ఎవరికి దొరక్కుండా ఉండేందుకు అధిక స్పీడుతో అధికారుల కన్ను కప్పి ఇసుకను తరలించడం జరుగుతుంది అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి . తోలుకున్నోళ్లకు తోలుకున్నంత అన్నట్టుగా ఉంది వీళ్ళ వ్యవహారం భద్రాచలంలోని కొంతమంది డాక్టర్ల యజమానులు కుమ్మక్కై రహస్యంగా ఇసుక ను తోలుకుంటూ.. అడ్డెవరు మాకు అన్నట్లుగా వాళ్ల వ్యవహార శైలి కనిపిస్తుంది ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సహజ వనరులైన ఇసుకను దొంగతనంగా తోలుకుంటూ వేలకు వేలు సొమ్ము చేసుకుంటూ పగలు దర్జాగా తిరుగుతున్నారు. ఎక్కడ ఇసుక కన పడిన మాయం చేస్తున్న అక్రమ ఇసుక కేటుగాళ్లను. నిఘా పెట్టి ప్రభుత్వ యంత్రాంగం వీరి అక్రమ ఇసుక



రవాణాను అరికట్టాలని వారి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని తగిన జరిమానా విధించి ఇసుక ముఠా కిలాడీలను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సహజ సంపద అయిన ఇసుకను కాపాడి గోదారిలో నీటి నిల్వలను ఉండే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకొని ఇసుఖాసురులను నిరోధించాలని ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.



# వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**శాలిగౌరారం, విశాలభారతి:** గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బర్రెలక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లకొండ పరమేష్ గౌడ్ జన్మదినం సందర్భంగా హైద్రాబాద్ కేబికే మల్టీ స్పెషాలిస్ట్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బర్రెలక్క ప్రారంభించారు. ఈ శిబిరంలో ముఖ్యఅతిథి గా పాల్గొన్న బర్రెలక్క గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్లలేక పోతున్నారని అటువంటి వారికి స్వచ్ఛంద సంస్థల వారు ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఆనంతరం రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి , సింగల్ విండో వైస్ ఛైర్మెన్ మహేందర్ రెడ్డి, జమ్మూ నగేష్, చిత్తలూరి జీడికల్లు,గూని వెంకటయ్య, పాకాల సతీష్, లోడంగి మహేష్,అన్నెబోయిన అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# సమ్మెను జయప్రదం చేయండి

**సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జెఎసి**

**మణుగూరు, విశాలభారతి :** ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మణుగూరు మండలంలోని శుక్రవారం నాడు సిపిఐ కార్యాలయంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకుల అఖిలపక్ష సమావేశం ఐఎఫ్ టియు ఏరియా అధ్యక్షులు ఏ మంగీలాల్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2024 ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి, ఐఎన్ టియుసియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

- **ఫిబ్రవరి 4న బిఆర్ఎస్ కోదాడ విస్తృతస్థాయి సమావేశం**
- **మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్**



**కోదాడ, విశాలభారతి:** నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ ద్వారా నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీళ్లు అందించకుండా, ఖమ్మం జిల్లాకు తరలించడం , దీనిపై నల్లగొండ జిల్లా ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దురదృష్టకరమని బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతం అని తెలిపారు. బీఆర్ఎస్ అధికార పక్షంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా మనమెప్పుడు ప్రజల పక్షమేనని స్పష్టం చేశారు. తెలంగాణాని అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టింది బీఆర్ఎస్ పార్టీనేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుతం అని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తాశారని ఆయన అన్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తేనే గ్యారంటీలను అమలు చేస్తామంటున్నారని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు, గ్యారెంటీలు అమలు చేసేది లేదని చెప్పారు. ఆ పార్టీకి గతంలో వచ్చిన సీట్లు కూడా రావన్నారు. కార్యకర్తలు ఎవరు కూడా అధైర్య పడొద్దు అందరం కలసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఓటమిపై సమీక్ష జరుపుదాం. తప్పొప్పులు సరి చేసుకొని ప్రజల పక్షాన నిలబడుతం అన్నారు. ఫిబ్రవరి 4న గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో జరిగే విస్తృత సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు

**పినపాక, విశాలభారతి :** మండలంలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో గల శ్రీ శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం పదవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముక్కు వెంకట నర్సారెడ్డి ఆద్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా ఉదయం కాగడ హారతి, సహస్ర నామ పూజ కార్యక్రమాలు, అర్చన, విశేష పూజలు, అభిషేకాలు, సాయిబాబా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి అంబడిపూడి ప్రసాద్ శర్మ, కమిటీ సభ్యులు, గంగిరెడ్డి వెంకటరెడ్డి,మాలపాటి రామిరెడ్డి, కొండా తిరుపతి రెడ్డి, శిరసాని రామిరెడ్డి, వెన్నా కాశిరెడ్డి , చిట్టూరి సత్తిబాబు, సాయిబాబా ఆలయ మహిళా సేవా సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐటిఐలో అప్రెంటిస్ మేళా

**ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్**



**మణుగూరు, విశాలభారతి :** ఫిబ్రవరి 12న మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఐటిఐ పూర్తి చేసుకున్న యువతి యువకుల కోసం నిర్వహిస్తున్న అప్రెంటిస్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అప్రెంటిస్ మేళా కోసం భద్రాద్రి జిల్లా లోని సింగరేణి కాలారీస్ ఐటీసీ బీపీల్, ఫీమకేం, మరియు హైదరాబాద్ కు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు.

# బెల్ట్ షాపుల తీరు మారలేదు

- **మద్యానికి బానిసవుతున్న యువత**
- **బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు**



**బూర్గంపాడు, విశాలభారతి :** ప్రభుత్వం మారినా బెల్ట్ షాపుల తీరుమారలేదని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కే.వి.రమణ అన్నారు. శుక్రవారం నాడు బూర్గంపాడు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి మండలంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారుబెల్ట్ షాపులు నివారిస్తామని గత ఎన్నికల్లో హామీలు గుప్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన తర్వాత ఈ ఊసే మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. పేద ప్రజల జీవితాలు ఆగమైనా కానీ అక్రమార్జనే ధ్యేయంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నాయని అక్రమ మద్యం తయారీ, అమ్మకాలను అదుపు చేయాల్సిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు.బెల్టు షాపుల కారణంగా యువత మద్యానికి బానిసై, అప్పుల పాలై కుటుంబాలకు కుటుంబాలే నాశనం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కె.వి రమణ, గాడిద దామోదర్, సోడే వీరస్వామి ఇల్లందుల శేషు, కనుక సాగర్ , పాయం సింగరాజు, కొప్పుల శేఖర్, గురుజాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

**రామన్నపేట, విశాలభారతి:** మండలంలోని వెల్లంకి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాబోయే నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ని నల్గొండ లోని ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి బోకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జంపాల వెంకట అరవింద్, తలారి శేఖర్, కోరబోయిన నరసింహ, కొరబోయిన మధు, నకిరేకంటి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



# శోభన్ నాయక్ కు ఘన సన్మానం

**సన్మానించిన సిటీ స్టైల్ జిమ్ కోచ్, సభ్యులు**

**భద్రాచలం, విశాలభారతి:** గణతంత్ర దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్వో కృష్ణ గౌడ్, వారి చేతుల మీద నుండి జనవరి 26న ప్రశంసా పత్రం పొందినందుకు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి ,సభ్యులు శోభన్ నాయక్ ని సాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శోభన్ నాయక్ మాట్లాడుతూ అక్రమ కలపను అరికట్టడంలో , విలువైన వృక్ష సంపదను అన్యాక్రాంతం కాకుండా, పోడు కొట్టకుండా నివారించడం, కలప తరలిస్తున్న విలువైన టేకు, తునికి అక్రమ లారీలను పట్టుకొని, అటవీ శాఖకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడం వలన ఈ ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ స్టైల్ జిమ్ కోచ్ జీవి రామిరెడ్డి, మహంతి వెంకటకృష్ణ, స్టైల్ జిమ్ సభ్యులు పాల్గొన్నారు



# పౌష్టికాహార లోపంపై అవగాహన సదస్సు

**అంగన్వాడి సెంటర్ ని సద్వినియోగపర్చుకోవాలి**

**మరిపెడ, విశాలభారతి:** మండలంలోని కుడియ తండా గ్రామపంచాయతీ అంగన్వాడి సెంటర్లో పౌష్టికాహార లోపంపై గర్భిణీలకు అవగాహన సదస్సును కుడియ తండ అంగన్వాడి సెంటర్ నందు నిర్వహించడం జరిగింది. కుడియ తండాలో ఉన్న ప్రతి గర్భిణీ ప్రతిరోజు సెంటర్ కు వచ్చి గుడ్లు పాలు తీసుకుని వెళ్లాలని గర్భిణీలకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత, అంగన్వాడి టీచర్ జ్యోతి, మంజుల, మమత, మధుశ్రీ, వీరమ్మ, మంజుల పాల్గొన్నారు.



# పార్టీని బలపర్చడమే ముఖ్యం

- **టికెట్ ఎవరికొచ్చినా గెలిపించాలి**
- **డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్**

**మరిపెడ, విశాలభారతి :** పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఎవరికొచ్చినా పార్టీని బలపర్చి గెలిపించాలని, ప్రజల్లో చైతన్యం వస్తోందని బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో తప్పక గెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలో ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ గుడిపుడి నవీన్ రావు గోడౌన్ వద్ద ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదా రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచుల సత్కార కార్యక్రమానికి ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ గుడిపుడి నవీన్ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా తనకు అన్నుదన్నుగా నిలిచి గ్రామాలు, అభివృద్ధిలో పాలు పంచుకుంటూ అన్ని వసతులు సమకూర్చిన సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. పదవీ కాలం ముగిసినా పార్టీ చేసిన పనులు, గ్రామాల అభివృద్ధిని ఇంటింటికి వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. వచ్చే ఎన్నికలే టార్గెట్ గా ప్రజలతో మమేకం కావాలని,తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రామడుగు అచ్యుత రావు, కుడితి మహేందర్ రెడ్డి, గుగులోత్ వెంకన్న, జర్పుల కాలు నాయక్, సర్పంచులు ఫోరం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కెమిస్ట్రీ విభాగం బిఓఎస్ గా ప్రో.జె.రాం చందర్

**సికింద్రాబాద్,విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం, సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం నూతన బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ( BOS ), గా జాదవ్ రాం చందర్ నియమితులయ్యారు. ప్రో.రాం చందర్ పీజీ బిక్కునూర్ కళాశాలలో వార్డెన్ గా,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గా,ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా పనిచేశారు. నిజాం కళాశాల హెడ్ గా పలు కమిటీల్లో సభ్యులు గా సేవాలు అందించారు.ఓయూలో ఫోరెన్సిక్ సైన్స్ బి ఓ ఎస్ గా పని చేశారు. విభాగం అభివృద్ధి కి కృషి చేస్తానని చెప్పారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

- **మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలి**

**దేవరుప్పుల, విశాల భారతి:** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని దేవరుప్పుల ఎస్సై శ్రవణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రధాన చౌరస్తా ప్రాంగణంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ముందుగానే పసిగట్టి నిర్మూలిస్తే బాగుంటుందని తెలిపారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలు దిగుమతి చేసుకునే వారిపై నిఘాపెట్టి, సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తుకు అలవాటు పడకుండా తల్లిదండ్రులతోపాటు గ్రామాల్లో పెద్దలు ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు అందరి కృషి అవసరమని గంజాయి అమ్మకం, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తుకు బానిసగా మారిన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా చివరకు వారినే ఏజెంట్లుగా మార్చి చాప కింద నీరులా తన సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సదానందం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ లు మసూద్, భాస్కర్, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన చేప లభ్యం



**మునగాల, విశాలభారతి:** తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన విషయం విధితమే. మునగాల మండల కేంద్రం సాగర్ హెడ్ రెగ్యులేటర్ దగ్గర ఎడమ కాలవలో చేపల కోసం వేట సాగిస్తున్న మండల కేంద్రానికి చెందిన వత్సవాయి అనిల్ గౌడ్ కి శుక్రవారం అరుదైన వింత చేప లభ్యమైనది. ఈ చేపను పరిశీలించగా ఆరు రెక్కలతో ఉండి, నోరు క్రింది భాగంలో, గవద కింద కళ్ళు, మొప్పలు లేకుండా మొసలి ఆకారంతో ఒళ్లంతా నల్లని మచ్చలతో ఉంది. మండల కేంద్రానికి చెందిన జంతు శాస్త్ర సీనియర్ అధ్యాపకులు గాయం శ్రీనివాస రెడ్డి ఈ చేపను పరిశీలించి ఆసక్తికర విషయాలు చెప్పారు. వారు చెప్పిన వివరాల ప్రకారం ఈ చేపను సాధారణంగా రాకాసి చేప, అమెజాన్ సైల్ఫిన్, క్యాట్ ఫిష్ అంటారని ఇది దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదిలో మాత్రమే లభిస్తుందని అన్నారు. ఇది ప్రస్తుతం కృష్ణ, గోదావరి నదిలోకి వలస వచ్చిందని ఇది ప్రమాదకరమైన చేప అని తెలిపారు. ఈ చేప కేవలం మాంసాన్ని మాత్రమే ఎక్కువగా తింటుందని, ఇది ఒకవేళ చెరువుల్లో చేరితే తోటి చేపలను తిని చుట్టుపక్కల పర్యావరణాన్ని నాశనం చేస్తుందని అన్నారు. ఈ చేప చెరువుల్లో ఉంటే మిగతా చేపలను తినేస్తుందని రైతులకు నష్టం కలిగిస్తుందని వెల్లడించారు. చెరువుల్లో చేరి ఆహారాన్ని తినేయడంతో పాటు ఆక్సిజన్ పూర్తిగా పీల్చేస్తుందని మిగిలిన చేపలను బతకనివ్వదని తెలిపారు.



# పాలకవర్గానికి సన్మానం

**మరిపెడ, విశాల భారతి:** డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలం శివారు అనేపురం గ్రామపంచాయతీ పాలకవర్గానికి గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపిఓ పూర్ణచందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దామెర్ల వీరన్న, ఉప సర్పంచ్ శ్రీనులను గ్రామ పెద్దలు అందరు కలిసి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దామెర్ల వీరన్న, ఉప సర్పంచ్ శీను మాట్లాడుతూ అనేపురం గ్రామపంచాయతీకి అందరి సహకారంతో మమ్మల్ని సర్పంచ్ ఉప సర్పంచ్ గా ఎన్నుకొని ఐదు సంవత్సరాలు విజయవంతంగా మాకు సహాయ సహకారాలు అందించిన, ప్రతి ఒక్కరికి మీ అందరికీ రుణపడి ఉంటామని చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ పూర్ణచందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ పార్టీ అధ్యక్షులు వీరన్న , గ్రామ సీనియర్ నాయకులు హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మార్కెట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎం కంటి ఆసుపత్రిని శుక్రవారం సాయంత్రం పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, కంటి వైద్యులు మెరజ్, తదితరులు పాల్గొన్నారు.





# ప్లే ఫర్ మల్కాజ్ గిరి క్రికెట్ టోర్నీ

- విజేత షాపూర్ షాబాజ్ టీమ్
- విజేతకు ట్రోఫీ,50 వేల నగదు బహుమతి

**విశాలభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్:** మూడు రోజులు గా కొనసాగుతున్న బీజేపీ నాయకులు పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్క కోమరయ్య నిర్వహించిన ప్లే ఫర్ మల్కాజిగిరి క్రికెట్ టోర్నీ క్రీడల పోటీలు ఘనంగా ముగిశాయి. మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలో నుండి మొత్తం 40 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ లో 440 మంది క్రీడాకారులు పోటీ పడగా సెమి ఫైనల్ కి షాబాజ్ జట్టు,కేఎస్ఎం జట్టు, భూషణ్ టీమ్, గారుడసేన 4 జట్లు చేరుకోగా సెమి ఫైనల్ లో మొదటి సెమీఫైనల్ లో కేఎస్ఎం టీం పై షాబాజ్ టీం విజయం సాధించి ఫైనల్ కిచేరుకుంది. 2వ సెమి ఫైనల్ లో భూషణ్ టీం తో గరుడ సేన టీం తలపడగా ఈ మ్యాచ్ లో భూషణ్ టీం విజయం సాధించి ఫైనల్ కు చేరుకోగా ఫైనల్స్ లో షాబాజ్ టీం భూషణ్ టీం పై విజయం సాధించి ట్రోఫీని గెలుచుకోవడం జరిగింది. విజేతల బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ పల్లవి గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ సుశీల్ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. టోర్నమెంట్ విన్నర్స్ కు ట్రోఫీ తో పాటు 50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. రన్నర్స్ కు రెండవ బహుమతి గా ట్రోఫీ తో 20 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. టోర్నమెంట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జై హనుమాన్ టీం క్రీడాకారుడు గణేష్ కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఫౌండేషన్ తరుపున ప్రతీక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రమ్ బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి అతిష్ బాబు, దుండిగల్ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ యాదవ్ లతో పాటు బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బోయిన్పల్లి మార్కెట్లో రైతు పొట్టకొడుతున్న ట్రేడర్స్

**పంట అమ్మకాన్ని అడ్డుకుంటున్న వైనం**



**విశాలభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో నిన్న శుక్రవారం రోజున వినూత్న సంఘటన చోటుచేసుకుంది. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ గా గుర్తింపు పొందిన బోయినపల్లి కూరగాయల మార్కెట్ 2001 డిసెంబర్ 20న మోండా నుండి విడిపోయి బోయినపల్లి మార్కెట్ గా రూపాంతరం చెందిన విషయం విదితమే,అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి, డైరెక్టర్ దేశంలో ఎక్కడ లేకుండా బోయినపల్లి మార్కెట్లో 175 మందికి ఓనర్ షిప్ అధికారాలను కట్టబెడుతూ, లైసెన్సులను జారీ చేశారు. అసలు కిటుకు ఇక్కడే ఉంది, మార్కెట్లో ఉండాల్సిన 175 మంది కమీషన్ ఏజెంట్లు, కాస్త 300 పైచిలుకు బినామీ పేర్లతో వివిధ రకాల ఓనర్షిప్పులతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటే.. అడ్డుకోవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో, దీన్ని అణువుగా తీసుకున్న ట్రేడర్స్ ఇష్టారాజ్యంగా పెట్రేగిపోతున్నారు.1966 వ్యవసాయ చట్ట ప్రకారం లైసెన్స్ పత్రంలో పొందుపరిచిన నియమాలను ఉల్లంఘిస్తూ, ఒక్కొక్క కమిషన్ ఏజెంటు, ఇద్దరు మొదలుకొని నలుగురు వరకు కిరాయికి ఇస్తూ లక్షల్లో దండుకుంటున్నారు. కేవలం వేళ్ళ మీద లెక్కపెట్టినంత మందే వ్యాపారం నిర్వహించడం శోచనీయం. ఈ నేపథ్యంలో సదరు కమీషన్ ఏజెంట్ కి గత మూడు రోజుల క్రితం రైతు పండించిన సరుకు అత్యధికంగా రావడంతో పార్కింగ్ స్థలంలో అన్లోడ్ చేయడం తో యార్డులో ఉన్న ఇతర కమిషన్ ఏజెంట్లు ఒక్కసారిగా ముప్పేట దాడి చేశారు. ఇదే విషయాన్ని గ్రేడ్ వన్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా... రైతుకు బాసటగా నిలిచారు ఆ కార్యదర్శి. వచ్చిన కమిషన్ ఏజెంట్లకి రైతు తీసుకొచ్చిన సరుకుకు అండగా ఉంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే మా బాధ్యత అంటూ ట్రేడర్స్ కి సమాధానమివ్వడంతో, అదిగాక మీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసుకుంటే మీకే నష్టమంటూ హితవు పలికారు.

**రైతన్న ఆవేదన? రైతు సమన్వయ కమిటీ జాడేది?**

కాలం గడుస్తున్న ప్రభుత్వాలు మారుతున్న రైతుల తలరాత మాత్రం మారడం లేదు. కష్టపడి ఎండనక వాననక చెమటను చిందించి పండిన పంటను మార్కెట్కు తీసుకొస్తే కమిషన్ ఏజెంట్ల పోరుతో రైతుకు పరోక్షంగా నష్టం చేకూర్చే విధంగా వ్యవహరించడం తో రైతు నష్టపోయే పరిస్థితి తలెత్తుతుంది. నిర్ణయిత సరుకు విక్రయించక పోవడంతో, కమిషన్ ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేవు, కానీ అన్నదాతకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లుతుందన్న విషయం తెలిసి కూడా కమీషన్ ఏజెంట్లు కయ్యానికి కాలు దువ్వుతున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు వెసులుబాటు కల్పించిన, కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో పూర్తిస్థాయిలో రైతులకి పెద్దపీట వేస్తారని, రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు న్యాయం జరగలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో బోయినపల్లి మార్కెట్లో తూకం విషయంలో ద్వంద్ వైఖరి వహించిన అధికారులు,హమాలీలకు నిరసనగా చేవెళ్ల నుంచి వేళల్లో రైతులు వచ్చి నిరసన వ్యక్తం చేసిన విషయం విధితమే, కానీ ఆరుకాలం శ్రమించి అన్నదాత పండించిన పంటకి, పలువురు ట్రేడర్స్ అడ్డుపడడం ఇది నిజంగా సిగ్గుచేటని, మరోసారి రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని పలువురు రైతులు హెచ్చరించడం తో పాటు గతం పునరావృతం అవుతుందని హితోపలికారు. చట్టంలో ఉన్న నియమాలను అధికారులు ఆచరణలోకి తీసుకువస్తే రైతులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మరో విషయం ఏమిటంటే బోయినపల్లి మార్కెట్లో కిరాయి దారులను తొలగిస్తే నిజమైన కమిషన్ ఏజెంట్లు ఎవరో బట్టబయలు కానుందని గుర్తు చేశారు.

### వ్యవసాయ చట్టం ఏం చెప్తుంది?

1966 వ్యవసాయ చట్ట ప్రకారం నేలలో పండిన ప్రతి గింజను వ్యవసాయ అధికారులు అన్నదాతకు వెన్నంటి ఉంటూ, పండించిన సరుకుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే వారి విధి విధానాలు, అనివార్య కారణాలవల్ల కమిషన్ ఏజెంట్లు రైతు పండించిన సరుకుకి అడ్డుపడ్డ? కృత్రిమ ఇబ్బందులు సృష్టించిన? సంబంధిత యార్డు కార్యదర్శి కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి లైసెన్సు రద్దు చేసే అధికారం ఉంది అన్న విషయం చట్టం చెబుతోంది. కేటాయించిన ట్రేడర్ కి ఒకే లైసెన్స్ ఒకే త్రాసు కలిగి ఉండాలి. వ్యవసాయ చట్టానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తే చట్టం లో పొందుపరిచిన చర్యలు తీసుకోవడానికి అధికారులకు అధికారం ఉంది.



# లా హాస్టల్ మెస్ ప్రారంభించాలి

- సెమిస్టర్ పరీక్ష బహిష్కరించిన విద్యార్థులు
- రోడ్డుపై బైటయింపు
- అరెస్ట్ చేసిన పోలీసులు



**సికింద్రాబాద్, విశాలభారతి :** ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల E1 హాస్టల్ మెస్ ను ప్రారంభించాలని, హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సెమిస్టర్ పరీక్షను బహిష్కరించి విద్యార్థులు రోడ్డుపై బైటాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ గత 8 నెలలుగా మెస్ లను ప్రారంభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, 2 సంవత్సరాలుగా నెలవారీ మెస్సు బిల్లులను నోటీస్ చేయలేదని అన్నారు. హాస్టల్ లో నెలలు గడుస్తున్నా వాష్ రూములు సరిగ్గా లేకపోవడం, హాస్టల్లో కనీసం త్రాగు నీరు సదుపాయం కల్పించడం లేదనీ అవేదన వ్యక్తం చేశారు. సెమిస్టర్ పరీక్ష ఫీజులను ప్రతీ సెమిస్టర్ కి పెంచడంతో తమపై అధిక భారం పడుతోందని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సెమిస్టర్ పరీక్ష ను బహిష్కరించి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలిసులు పెద్ద ఎత్తున చేరుకుని అరెస్టు చేసి ఓయూ పోలీస్ స్టేషన్ కి తరలించారు.

# మల్లారెడ్డి రియల్ ఎస్టేట్ విద్యా నేరగాడు

- కల్వకుంట్ల కుటుంబంలా - మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు పదవులు.
- అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే సీఎంను కలయిక
- కీసరగుట్ట దేవస్థానం ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది..
- ఎమ్మెల్యే అతిథి మాత్రమే
- టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడిపల్లి,విశాలభారతి:** తాను చేసిన భూ కబ్జాలు, అవినీతి నుండి తప్పించుకోవడానికి మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేముందని దిగజారుడు మాటలు మాట్లాడి జిల్లా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని టీపిసిసి రాష్ట్ర ఉపాధ్యాక్షులు , మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి, పేదల భూములు ఆక్రమించుకొని కాలేజీలు, యూనివర్సిటీలు, బంగ్లాలు నిర్మించి అవినీతికి పాల్పడ్డ చరిత్ర మల్లారెడ్డిదన్నారు. సరైన విద్యాప్రమాణాలు పాటించకుండా, ఎంతో మంది విద్యార్థుల ఆత్మహత్యలు, మరణాలకు కారకుడైన రియల్ ఎస్టేట్, విద్యా నేరగాడు మల్లారెడ్డి అన్నారు. ఇప్పటికే తనకు, తన అల్లుడికి ఎమ్మెల్యే (రాజశేఖర్ రెడ్డికి ) ఉండగా సిగ్గు లేకుండా తన కొడుకును కూడా మల్కాజిగిరి ఎం.పి గా పోటీ చేపించాలని చూస్తున్నారని వజ్రేష్ విమర్శించారు. తన కుటుంబం కూడా కె.సి.ఆర్ కుటుంబంలా కావాలని కలలు కంటున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి ఎం.పి నియోజకవర్గ ప్రజలు చాలా చైతన్యవంతులని మల్లారెడ్డి దిగుజారుడు మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ ఎన్నికల్లో మల్లారెడ్డికి చావు దెబ్బ తప్పదని హెచ్చరించారు. కీసర గుట్ట దేవస్థాన ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది తప్ప ఎమ్మెల్యే కాదని, అతను కూడా ఒక అతిథి మాత్రమే అని గుర్తు చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు పొందేందుకే మల్లారెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని వజ్రేష్ యాదవ్ హెద్దేవా చేశారు. ఎప్పటికైనా మల్లారెడ్డి, ఆయన కుంటుంబం జైలుకు వెల్లడం ఖాయమన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**నూతనకల్, విశాలభారతి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇమ్మారెడ్డి చోక్కమ్మ ,ఇరుగు హుస్సేన్ లతోపాటు మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బాణాల చంద్రమ్మ ,బిక్కి పద్మ, ఉప్పునూతల వెంకన్న లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.శుక్రవారం తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేల్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మృతుల చిత్రపటాలకి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమా మల్లారెడ్డి,నాయకులు కట్ట మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

**డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్**

**తుంగతుర్తి, విశాలభారతి:** భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని హైద్రాబాద్ గాంధీ భవన్ లో దరఖాస్తును సమర్పించిన సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను ఒక రైతు బిడ్డని కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని దశబ్దాల కాలంగా పార్టీ నిర్మాణం కోసం ప్రాణాలను సైతం అడ్డుపెట్టి నిరంతరం ప్రజా సమస్యల కొరకై ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని, గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నానని తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చల్ల తేజ, రేకినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి రేగటి రవి, మాజీ సర్పంచ్ జక్కు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తా

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి.**

**ఎల్బీనగర్, విశాలభారతి:** చంపాపేట డివిజన్ పరిధిలోని న్యూ పద్మ నగర్ కాలనీలో జరుగుతున్న బాక్స్ డ్రైన్స్ పనులను కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఈ బాక్స్ డ్రైన్స్ ఎత్తు తగ్గించాలని సుధీర్ రెడ్డి ని కోరడం జరిగింది. అధికారులతో చర్చించి తరువాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు, ఉదయ్ నగర్ కాలనీ బాక్స్ డ్రైన్స్ కూడా అతి త్వరలో జంక్షన్ దగ్గర కలపడం జరుగుతుంది అని తెలిపారు. పనులు నెమ్మదిగా సాగడం జరుగుతున్నాయి,అని పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు సకాలంలో పూర్తి అయితే వరదనీటి ముంపు సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది అని తెలిపారు. ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ నల్ల రఘుమరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, ముడుపు రాజిరెడ్డి, రవి ముదిరాజ్,మల్లేష్ గౌడ్,ఉమ మాహేశ్వర్, నగేష్, శివ,నిష్కాంత్ రెడ్డి,జగదీష్, శ్రవణ్ కుమార్ రెడ్డి,యాదయ్య,విజయానంద్ రెడ్డి,నారాయణ రెడ్డి,ఆంజనేయులు ,నగేష్,శ్రీనివాసులు,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# యాదవుల సంక్షేమానికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి:** యాదవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీలో గల గోకుల్ ఫంక్షన్ హాలులో పటాన్ చెరు యాదవ సంఘం ఆధ్వర్యంలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసినప్పుడే విజయం సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలకు ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# స్టీల్ గ్లాసుల పంపిణీ

**నూతనకల్, విశాలభారతి:** మండల పరిధిలోని పెదనెమిల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి సామ రాజశేఖర్ రెడ్డి, వారి సోదరుడు రాకేష్ రెడ్డిలు వారి తండ్రి మల్లారెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే రాగి జావ త్రాగుటకు విద్యార్థులందరికీ సుమారు 120 స్టీల్ గ్లాసులను శుక్రవారం పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ప్రధానోపాధ్యాయులు శివయ్య, మాజీ ఉప సర్పంచ్ మధు, ఉపాధ్యాయులు హరికృష్ణ చారి, ఉమారాణి, కవిత, ఉప్పయ్య నాయక్, వెంకయ్య ,పద్మావతి,మంజుల, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు మధు, మహేష్,రాము తదితరులు అభినందించారు.



# ఆర్థిక సహాయం అందజేత

నూతనకల్, విశాలభారతి: మండల పరిధిలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన దూదిగాం లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం భగత్ యూత్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయంగా 6500 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పేదవారికి ఆపద సమయంలో తమ వంతు సహకారం అందించడం ద్వారా వారికి చేయూతనిచ్చినట్లు అవుతుందని ఇలాంటి పనులు చేయడం ద్వారా మాకు సంతృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పవన్ రెడ్డి, విజయ్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి, సతీష్,సదానంద చారి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపికైన చిల్పకుంట్ల మహిళా

**అభినందనలు తెలిపిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు**



**నూతనకల్,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్టాఫ్ నర్స్ ఫలితాల్లో సూర్యాపేట జిల్లా నుతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పులుసు శోభ ఎంపికైంది. హైదరాబాద్ లోని ఎల్బి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ శోభకు స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. పస్తాల గ్రామానికి చెందిన పుల్సు సోమలింగయ్య, సుగుణమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు దంపతులిద్దరూ సాధారణ రైతు పిల్లలని కష్టపడి చదివించారు. చిన్న కూతురు శోభ చిన్నతనం నుండి చదువుల్లో చురుకుగా ఉండేది, ప్రాథమిక మరియు ఉన్నత విద్యాభ్యాసం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేసింది. అనంతరం సూర్యాపేట లోని చందన నర్సింగ్ ఇన్స్టిట్యూట్ లో జీఎన్ఎమ్ పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిరాలుగా గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తుంది. ఇప్పుడు స్టాఫ్ నర్స్ ఉద్యోగం రావడం చాలా సంతోషం కలిగించిందని తన నాన్న కోరుకున్న ఆశయం నేటికీ నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు

# ఉర్దూ మీడియం స్కూల్ ను సందర్శించిన ఎమ్మెల్యే

**ఉప్పల్, విశాలభారతి:** రామాంతపూర్ డివిజన్ ఇంద్రానగర్ ఉర్దూ మీడియం స్కూల్ ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి స్కూల్ పిల్లలతో కలిసి మధ్యహ్న భోజనం చేశారు. స్కూల్ లో తరగతి గదులు మరియు భోజన వసతులను పరిశీలించి అధ్యాపకులతో మాట్లాడి స్కూల్ కి సంబంధించి ఏటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే సహాయ సహకారాలు అందిస్తామని పేర్కోన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు గంథం నాగేశ్వరావు,సాలార్,శ్రీకాంత్ గౌడ్,బోసాని పవన్ ,సురం శంకర్ ,మారుతి ,లడ్డు ,అద్విత్,రామకృష్ణ , మరియు మజీద్ పేదలు తదితరులు పాల్గోన్నారు



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily

శనివారం,
03.02.2024
హైదరాబాద్

# గుండెపోటుతో బిఆర్ఎస్ కార్యకర్త మృతి



**ఆర్మూర్, విశాల భారతి:** నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్ మండలం లక్కంపల్లి గ్రామానికి చెందిన మూఢ మహేందర్ (39) శుక్రవారం మధ్యాహ్నం హార్ట్ ఎటాక్ తో మృతి చెందినట్లు సన్నిహితులు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా మహేందర్ పని చేస్తున్నారు. మహేందర్ భార్య లక్కంపల్లి తాజా మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాలమూరు ప్రగతి కాంగ్రెస్ తోనే సాధ్యం

**పాలమూరు న్యాయ యాత్రలో ఆశాదీప్ రెడ్డి**



**కల్వకుర్తి, విశాల భారతి**:మహబూబ్నగర్ పార్లమెంట్ ప్రగతి కోసం, అభివృద్ధి కోసం జనం సమస్యలు నేరుగా తెలుసుకోవడం కోసం ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్ల వంశీచంద్ చేపట్టిన పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా 3 వ రోజు శుక్రవారం మక్తల్ నియోజకవర్గంలో యాత్ర కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి యాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశీచంద్ రెడ్డి 2014లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కల్వకుర్తి అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ కోసం, కల్వకుర్తి ప్రాంత రైతుల కోసం కె ఎల్ ఐ కాల్వ ద్వారా సాగునీరు తీసుకు రావడంలో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. రాబోయే మహబూబ్నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించి, మహబూబ్నగర్ అభివృద్ధి ప్రగతి పథంలో నడిపించుకోవాలని ఆశాదీప్ రెడ్డి కోరారు.



# ఉచిత కంటి పరీక్ష శిబిరం

**బాల్కొండ, విశాల భారతి:** సూర్య ఆరోగ్య సంస్థ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ పండిత్ ఎం.నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుంకెట్ లోనీ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 240 మంది విద్యార్థులకు ఆప్తలమిక్ శ్రీకాంత్ కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చుక్కల మందులను పంపిణీ చేసారు . దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించామని, వారికి త్వరలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని సంస్థ ముఖ్య కార్యనర్వహణాధికారి రాజేంద్ర కుమార్ విక్రమ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రశాంత్, వినోద్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# విశాల భారతి దిన పత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**చేవెళ్ల, విశాల భారతి:**చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం గ్రామ సర్పంచ్ గూడెం సురేందర్ శుక్రవారం విశాల భారతి 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ.. విశాల భారతి పత్రిక రిపోర్టర్లు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని చెప్పారు. అనంతరం సర్పంచ్ ల పదవి కాలం ముగియడంతో గ్రామపంచాయతీలో ఉన్నటువంటి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ పరమేష్, వార్డ్ నెంబర్ రాజ్ కుమార్, ఆశా వర్కర్ అమృత మణిల పాల్గొన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్‌గా అల్లీపూర్ జడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థి



**విశాలభారతి, జగిత్యాల:**జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ జడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థి ఎండీ. తాజోద్దీన్ నర్సింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యాడు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన వైద్యారోగ్య శాఖ ఫలితాల్లో మెరిట్ సాధించి ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామాక పత్రాలను అందుకొని అల్లీపూర్ జిల్లా పరిషత్ స్కూల్ ఖ్యాతిని పెంచాడు. ఈ పాఠశాలలో 2005వ బ్యాచ్‌కు చెందిన తాజోద్దీన్, అనంతరం నర్సింగ్ విద్య కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ కాలేజీలలో ఒకటైన ఓవైసీ కాలేజీ ఆఫ్ నర్సింగ్ చేరి 2011లో పూర్తి చేశాడు. అనంతరం పలు వైద్యశాలలో వైద్య సేవలు అందించి 12ఏళ్ల సుదీర్ఘ అనుభవం పొందాడు. ప్రస్తుతం ఎల్బీ నగర్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌లో ఐసీయూ స్పెషలిస్టుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాల ఫలితాల్లో మెరిట్ సాధించి అందరీ దృష్టిని ఆకర్షించాడు. వైద్య రంగంలో కొనసాగుతూనే పరీక్షకు సన్నద్ధమయ్యాయని, ఈ నోటిఫికేషన్‌లో మంచి స్కోర్‌తో మెరిట్ రావడం సంతోషంగా ఉందన్నాడు. వైద్య సేవలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం నియమించిన నర్సింగ్ పోస్టులో బాసర జోన్ పరిధిలో సాధించినట్లుగా తెలిపాడు. కాగా అల్లీపూర్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ఆ స్పూర్తిని కొనసాగింపుగా తాజా ఉద్యోగ నోటిఫికేషన్‌లో నర్సింగ్ ఆఫీసర్‌గా నియామాక పత్రాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నాడు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు ఎండీ రాయబోసు కొడుకు తాజోద్దీన్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడంతో పలువురు అభినందించారు. కాగా రాయికల్ మండలం నుంచి పలువురు విద్యార్థులు కూడా నర్సింగ్ ఆఫీసర్ నియామాక పత్రాలను అందుకున్నారు.

# పీర్జాదిగూడలో ప్రోటోకాల్ వివాదం.

- **మున్సిపల్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు.**
- **అభివృద్ధి కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించారా....?**
- **నోరు మెదపని కమిషనర్..**
- **పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం.**



**మేడిపల్లి,విశాలభారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ జక్కవెంకట్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నట్లు.. అందుకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ నిధుల నుంచి కేటాయించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కార్యక్రమాలకు అన్ని తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ విషయంలో కమీషనర్ సైతం నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.. డిప్యూటీ మేయర్ అయిన తనకు అభివృద్ధి కార్యక్రమాలకు సమాచారం కాని ఆహ్వానం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే కార్పోరేషన్ లో నిధులు లేకుండా వ్యవస్థను నిర్వీర్యం చేసిన మహానుభావుడు మేయర్ గారు తన ఏకపక్ష వైఖరి కారణంగా పార్టీ లోను తప్పడం లేదన్నారు. తన వర్గం కార్పోరేట్లకు ఒకలా మరోకరికి మరోలా ప్రవర్తించడం విచారకరమన్నారు... ఈ ప్రోటోకాల్ విషయాన్ని జిల్లా అధికారులు, పార్టీ అధిష్టానం తీసుకవేళ్తమని... అవసరమైతే కాంట్రాక్టర్లకు చెల్లింపులపై సమగ్ర విచారణ అధికారులతో పాటు రానున్న కౌన్సిల్ లో ప్రతి చెల్లింపులు,నిధుల దుర్వినియోగం పై కార్పొరేటర్లతో కలసి నిలదిస్తామని హెచ్చరించారు.



# చిమ్రాజ్ పల్లి సర్పంచ్ కు సన్మానం

**ఆర్మూర్, విశాల భారతి:**నందిపెట్ మండలంలోని చిమ్రజ్ పల్లి గ్రామ సర్పంచ్ తోట గణేష్ ను ఆయన మిత్రులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గణేష్ ని సన్మానించిన వారిలో డొంకేశ్వర్ గ్రామానికి చెందిన పొగరి సంజీవ్, రవి ఉన్నారు.



# అలాంటి వాళ్లు కాంగ్రెస్ నుంచి వెళ్లిపోవడం మంచిందే: రాహుల్ గాంధీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండేవాళ్లు తమ పార్టీలో నుంచి వెళ్లిపోయినా తమకు ఇబ్బంది లేదన్నారు. శుక్రవారం తాను చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో డిజిటల్ మీడియా వారియర్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అస్సాంలో కాంగ్రెస్ పతనం, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గురించి అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానమిచ్చారు. హిమంత, మిలింద్ దేవరా లాంటి వ్యక్తులు కాంగ్రెస్‌ను విడిచిపెట్టాలనుకున్నారని.. ఇలాంటి వాళ్లు అలా వెళ్లిపోవడం పార్టీకి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అలాంటి వారు పార్టీ మారడమే సరైందేనని తెలిపారు.

**అత్యంత అవినీతి సీఎం హిమంత**

హిమంత బిశ్వ శర్మ విచిత్రమైన నాయకుడని.. అలాంటి వ్యక్తి అసలు కాంగ్రెస్ సిద్ధంతాలకు సరిపోదని విమర్శించారు. అతను ముస్లింలపై చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శమని చెప్పారు. తాను కాపాడాలనుకుంటున్న విలువలకు అతని చేసిన వ్యాఖ్యలు చాలా వ్యతిరేకమన్నారు. ఇదిలాఉండగా.. ఇటీవలే సీఎం హిమంత బిశ్వ శర్మ.. రాహుల్ గాంధీలు ఒకరినొకరు విమర్శలు చేసుకున్నారు. రాహుల్.. భారత్ జోడో న్యాయ యాత్ర ద్వారా అస్సాంలో అలజడి సృష్టించాలని చూశారంటూ హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు. దీనిపై స్పందించిన రాహుల్.. అత్యంత అవినీతి పరుడైన ముఖ్యమంత్రి హిమంత అంటూ విమర్శలు గుప్పించారు.


**ఎలాంటి ప్రభావం ఉండదు**

అయితే ఇటీవల మహారాష్ట్రలో మిలింద్ దేవరా కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేశారు. అనతరం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీలో చేరారు. ముంబై సౌత్ నియోజకవర్గానికి సంబంధించి.. ఇండియా కూటమి సీట్ల పంపకాల పట్ల అసంతృప్తి చెందిన ఆయన పార్టీ మారిపోయారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీలో విలువలు లేని అలాంటి నేతలు వెళ్లిపోవడం అనేది విపక్ష ఇండియా కూటమిపై కూడా ఎటువంటి ప్రభావం ఉండదని రాహుల్ అన్నారు.

# సోమారంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



**సైదాపూర్, విశాల భారతి:**మండలంలోని సోమారం గ్రామపంచాయతీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శి అభిలాష్ పట్టించుకోకపోవడంతో ప్రజలు నడిచే సీసీ రోడ్లపై పెంటను పోస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో పలు కుటుంబాలకు చెందినవారు అనేకమార్లు పంచాయతీ కార్యదర్శికి గత నలభై ఐదు రోజుల క్రితం నుండి చెప్తున్నా, ఇప్పటి వరకు కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్రమైన విమర్శ ప్రజల నుండి వస్తున్నది. సోమరం పంచాయతీలోని ఎంపీటీసీ ఇంటికి వెళ్లే సీసీరోడ్డు పై పెంటను పోస్తున్నప్పటికీ ఇప్పటివరకు నిలువ చేసిన పెంటను పారిశుధ్యం పనులలో భాగంగా ఎత్తకపోవడంతో దుర్వాసన వస్తుందని, గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి గ్రామంలోని పారిశుధ్యన్నే మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అభిలాష్ కు వివరణ కోరగా త్వరలోనే పారిశుధ్దాన్ని మెరుగుపరుస్తామని అన్నారు.




# అగ్ర రాజ్యంలో మరో భారతీయ విద్యార్థి మృతి..వారంలో మూడో కేసు!

అగ్రరాజ్యం లో మరో భారతీయ విద్యార్థి మృతి చెందాడు. కేవలం వారం వ్యవధిలో ముగ్గురు భారతీయ విద్యార్థులు అనుమానాస్పదంగా మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమెరికాలోని ఒహియోలోని సిన్సినాటిలో శ్రేయాస్ రెడ్డి అనే భారతీయ విద్యార్థి మృతి చెందినట్లు తెలిసింది.

అయితే విద్యార్థి మృతి చెందాడనికి గల కారణాలు ఇప్పటి వరకు తెలియలేదు. శ్రేయాస్ లిండర్ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థి అని తెలుస్తుంది. విషయం తెలుసుకున్న న్యూయార్క్ లోని భారత కాన్సులేట్ ఈ ఘటన గురించి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. అంతేకాకుండా వారికి అన్ని విధాల సహాయపడతామని హామీ ఇచ్చింది.

"ఒహియోలో భారతీయ సంతతికి చెందిన విద్యార్థి శ్రేయాస్ రెడ్డి బెనిగేరి దురదృష్టవశాత్తూ మృతి చెందడం పట్ల భారత కాన్సులేట్ అధికారులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఈ వారంలోనే వివేక్ సైనీ , నీల్ ఆచార్య అనే భారతీయ విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. జనవరి 30న, పర్డ్యూ యూనివర్సిటీలో ఆచార్య అనే విద్యార్థి చనిపోయాడని, టిప్పెకానో కౌంటీ కరోనర్ తెలిపారు. టిప్పెకానో కౌంటీ కరోనర్ ఆఫీస్ ప్రకారం, అధికారులు పర్డ్యూ క్యాంపస్ లో విద్యార్థి మృతి చెందినట్లు కనుగొన్నారు.

విద్యార్థి మృతి పై అనుమానాలున్నాయంటూ ఆచార్య తల్లి గౌరీ ఆచార్య అతనిని పర్డ్యూ యూనివర్సిటీలో డ్రాప్ చేసిన ఉబెర్ డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అతని గురించి వెదకడం ప్రారంభించారు. అతని గురించి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ఇదిలా ఉంటే జనవరి 29న ఆశ్రయం కల్పించిన భారతీయ విద్యార్థినే ఓ వ్యక్తి సుత్తితో కొట్టడం వల్ల విద్యార్థి చనిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన సంగతి తెలిసిందే. హత్యకు గురైన విద్యార్థిని వివేక్ సైనీ గా అధికారులు గుర్తించారు. ఈ హత్యకు సంబంధించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సైనీ మృతదేహాన్ని భారత్ కు పంపాడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు.

ఏది ఏమైనప్పటికీ అగ్ర రాజ్యంలో భారతీయ విద్యార్థుల వరుస మరణాలు తల్లిదండ్రులను కంగారు పెడుతున్నాయి.

# తమిళనాడు క్రీడా మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు కర్నాటక కోర్టు సమన్లు..!!



తమిళనాడు క్రీడామంత్రి ఉదయనిధి స్టాలిన్ కు కర్నాటక కోర్టు సమన్లు జారీ చేసింది. స్టాలిన్ గతేడాది సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో మార్చి4వ తేదీని కోర్టులో హాజరుకావాలంటూ ఆదేశించింది. సనాతన ధర్మం డెంగ్యూ,మలేరియా లాంటిందని ఉదయనిధి స్టాలిన్ గతేడాది చేసిన వివాదస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా కలకలం రేపాయి. చాలా మంది ఉదయనిధి స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. అతితీవ్ర వ్యాఖ్లయు కూడా స్టాలిన్ పై చేశారు. ఎన్నికల్లోనూ ఈ విషయంపై తీవ్ర చర్చే జరిగింది. ఇండియా కూటమి ఎమ్మెల్యేనే ఈ వ్యాఖ్యలుచేశారని..కాంగ్రెస్ వైఖరి కూడా ఇదేనా అంటూ ప్రత్యర్థి పార్టీలు ప్రశ్నలు సంధించాయి.

కానీ స్టాలిన్ మాత్రం తన వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు. తాను తప్పేమీ మాట్లాడలేదని సమర్థించుకున్నారు. మరోవైపు ఉదయనిధిని హిట్లర్‌తో పోలుస్తూ బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. "హిట్లర్ యూదులను ఎలా ప్రస్తావించాడు. ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని వివరించిన విధానానికి మధ్య అసాధారణమైన సారూప్యత ఉంది.హిట్లర్ లాగే ఉదయనిధి స్టాలిన్ కూడా సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అంటున్నారు. నాజీ ద్వేషం హోలోకాస్ట్‌కు ఎలా దారి తీసిందో మనకు తెలుసు. ఇది దాదాపు 6 మిలియన్ల యూరోపియన్ యూదులను, ఇతర బాధితులలో కనీసం 5 మిలియన్ల సోవియట్ యుద్ధ ఖైదీలను చంపింది. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్య ద్వేషపూరిత ప్రసంగం...సనాతన ధర్మాన్ని అనుసరించే భారత దేశంలోని 80 శాతం మంది ప్రజలను నరమేధం చేయాలని అతను పిలుపునిచ్చాడు అంటూ బీజేపీ మండిపడింది.



# ప్రజా సేవలోనే ఉంటాం

**పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లో మమేకమవుతాం**


**సైదాపూర్, విశాల భారతి** :పదవి విరమణ పొందినప్పటికీ ప్రతినిత్యం ప్రజా సేవలోనే ఉంటామని సర్పంచులు కాయిత రాములు , రేగుల సుమలత అశోక్, పైడిమల్ల సుశీల తిరుపతి గౌడ్ , తాటిపల్లి యుగంధర్ రెడ్డి లు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులకు పదవి విరమణ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు విలేకరులతో మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం ఏ రాజకీయ నాయకుడైన ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా కొనసాగి విరమణ పొందాల్సిందేనని తెలిపారు. పదవి విరమణ పొందినప్పటికీ ప్రజలు వారి అవసరాలు, సంక్షేమం కోసం మమ్మల్ని ఎప్పటికప్పుడు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎలాంటి అవకాశాలు వచ్చినా మళ్లీ ప్రజాప్రతినిధులుగా ముందుకు వస్తామని తెలిపారు.

# శోభన్ బాబు గొప్ప నటుడు.

**ఆయన నటించిన సినిమాలకు నేటికీ ప్రజాధరణ.**



**హైదరాబాద్,విశాల భారతి:** శోభన్ బాబు గొప్ప నటుడని ఆయన నటించిన సినిమాలు నేటికీ ప్రజాధరణకు నోచుకుంటున్నాయని రాశి మూవీస్ అధినేత ఎం నరసింహారావు అన్నారు. శోభన్ బాబు నటించిన బావ మరదళ్ళ సినిమా విడుదలై శుక్రవారానికి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి సభ్యులు నరసింహా రావును ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావ మరదళ్ళ సినిమా అనేక చోట్ల రికార్డు సృష్టించిందన్నారు. మొట్ట మొదటి స్టార్ చిత్రంగా విడుదలై 18 కేంద్రాల్లో వంద రోజులు సినిమా ఆడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, పూడి శ్రీనివాస్, టి సాయి కామరాజు, విజయ్, కుర్రా రాంబాబు, దార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# 'విశ్వంభర' యూనివర్స్ లోకి మెగాస్టార్ చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి మాగ్నమ్ ఓపస్ 'విశ్వంభర' టైటిల్ టీజర్‌తో తన అభిమానులను, ప్రేక్షకులని అలరించారు. టైటిల్ టీజర్ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చిత్ర బృందం 13 మ్యాసీవ్ సెట్‌లను నిర్మించి న్యూ వరల్డ్ ని క్రియేట్ చేశారు. నవంబర్ చివరి వారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైయింది. ఈరోజు చిరంజీవి విశ్వంభర ప్రపంచంలోకి అడుగు పెట్టారు. ఈరోజు షూటింగ్‌లో మెగాస్టార్ జాయిన్ అయ్యారు.
హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. టీం విడుదల చేసిన క్రియేటివ్‌లో చిరంజీవి విశ్వంభర ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లు చూపిస్తుంది. ఇది చాలా క్రియేటివ్, మెస్మరైజింగ్ గా వుంది. బింబిసార ఫేమ్ వశిష్ట ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటి వరకు మెగాస్టార్ చిరంజీవికి కాస్ట్లీయస్ట్ చిత్రంగా నిలుస్తోంది.

# ఏప్రిల్ 5న విజయ్ దేవరకొండ "ఫ్యామిలీ స్టార్"



స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న "ఫ్యామిలీ స్టార్" సినిమా రిలీజ్ డేట్ ను ఇవాళ మూవీ టీమ్ అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 5వ తేదీన ఈ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నట్లు అఫీషియల్ గా వెల్లడించారు. "ఫ్యామిలీ స్టార్" సినిమాను ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ లో స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. హోల్ సమ్ ఎంటర్‌టైనింగ్ డైరెక్టర్ పరశురామ్ పెట్ల రూపొందిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తోంది. "ఫ్యామిలీ స్టార్" చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు. "ఫ్యామిలీ స్టార్" సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో విజయ్ దేవరకొండ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్ లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని గన్నీ బ్యాగ్, ఆధార్ కార్డ్ తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ చూడగానే ఆకట్టుకుంటోంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టైటిల్ టీజర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన "ఫ్యామిలీ స్టార్" సినిమా థియేటర్స్ లో ఎంజాయ్ చేసేందుకు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.




# 92 ఏళ్ల టాలీవుడ్ చరిత్రలో ఆల్ టైమ్ సంక్రాంతి బ్లాక్ బస్టర్ గా 'హనుమాన్'

క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, యంగ్ హీరో తేజ సజ్జా లేటెస్ట్ సెన్సేషన్ 'హను-మాన్ '92 సంవత్సరాల టాలీవుడ్ చరిత్రలో ఆల్ టైమ్ సంక్రాంతి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుండి వచ్చిన మొదటి సినిమా అయిన ఈ ఫాంటసీ అడ్వెంచర్ ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల గ్రాస్ మార్క్ దిశగా దూసుకుపోతోంది. ఓవర్సీస్‌లో 5 మిలియన్ల మార్క్‌ను అధిగమించింది. ఈ చిత్రం పాన్ ఇండియాగా విడుదలైంది, హిందీతో సహా అన్ని భాషలలో అద్భుతమైన వసూళ్లను సాధించింది. హను-మాన్ నిజానికి నార్త్ రీజియన్‌లో స్ట్రెయిట్ హిందీ సినిమాలా అలరించింది. రిజనబుల్ టిక్కెట్ ధరలు ఉన్నప్పటికీ, హను-మాన్ అనేక బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన హను-మాన్ మూడు వారాల రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకొని ఇప్పుడు నాలుగో వారంలోకి ఎంటరైయింది. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం మరికొన్ని వారాల పాటు హను-మాన్ అద్భుతమైన రన్ కొనసాగుతుంది.

# మిస్ పర్ఫెక్ట్ వెబ్ సిరీస్ లో నటించడం రిఫ్రెషింగ్ ఫీల్ ఇచ్చింది

**- హీరోయిన్ లావణ్య త్రిపాఠీ**



లావణ్య త్రిపాఠీ హీరోయిన్ గా నటించిన ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ "మిస్ పర్ఫెక్ట్". ఈ వెబ్ సిరీస్ లో బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ హీరోగా నటించారు. "మిస్ పర్ఫెక్ట్" వెబ్ సిరీస్ ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వం వహించారు. ఇవాల్టి నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో "మిస్ పర్ఫెక్ట్" స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సిరీస్ హైలైట్స్ లేటెస్ట్ ఇంటర్వ్యూలో తెలిపింది హీరోయిన్ లావణ్య త్రిపాఠీ. "మిస్ పర్ఫెక్ట్"లో మంచి యాక్టర్స్ ఉన్నారు. అయితే నేను ఈ సిరీస్ మాట్లాడాలంటే ముందు స్క్రిప్ట్ గురించే చెప్పాలి. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన గుడ్ స్క్రిప్ట్ ఇది. ఇలాంటి స్క్రిప్ట్ నాకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో రెగ్యులర్ గా చూసే కామెడీ ఉండదు. డిఫరెంట్ క్యారెక్టర్స్ ఉంటాయి. ఈ వెబ్ సిరీస్ లో నేను మిస్ లావణ్య, లక్ష్మి అనే క్యారెక్టర్స్ లో నటించాను. ఆమె ఒక పర్ఫెక్షనిస్ట్. అలా ప్రతి పనిలో పర్ఫెక్ట్ గా ఉండాలనుకోవడం కొన్ని ఇబ్బందులు తీసుకొస్తుంది. ఈ క్యారెక్టర్స్ లో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఒక నటిగా నేను భిన్నమైన రోల్స్ చేయాలని కోరుకుంటాను. ఆ క్రమంలో నాకు "మిస్ పర్ఫెక్ట్" లో చేసే ఛాన్స్ దక్కింది.

నేను నటించిన మిస్ లావణ్య, లక్ష్మి క్యారెక్టర్స్ నా పర్సనల్ లైఫ్ కు దగ్గరగా ఉంటాయి. నేను రియల్ లైఫ్ లో కొద్దిగా ఈ క్యారెక్టర్స్ తో రిలేట్ చేసుకోగలను. ఇంట్లో ఉన్నప్పుడు లక్ష్మిలా ఉంటాను. సెట్ లో లావణ్య క్యారెక్టర్ లా పర్ఫెక్షన్ కోరుకుంటాను. నేను అడిగి మరీ సెకండ్ టేక్స్ చేస్తుంటాను. సినిమాలకు వెబ్ సిరీస్ కు పెద్ద తేడా ఏం కనిపించలేదు. "మిస్ పర్ఫెక్ట్" షూటింగ్ ఒక సినిమాకు జరిగినట్లే అనిపించింది. అయితే ఇక్కడ 30 డేస్ షూట్ తో కంప్లీట్ చేశాను. సినిమాకు అయితే ఏడాది పాటు వర్క్ చేయాల్సివస్తుంది. వరుణ్ తేజ్ తో పెళ్లి తర్వాత కెరీర్ పరంగా ఏమీ మారలేదు. మెగా కుటుంబంలోకి వచ్చాక నువ్వు ఇలా చేయాలి, అలా చేయాలి అని నాకు ఎవరూ చెప్పడం లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకునే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మిగతా వాళ్లు నన్ను చూసే విధానంలో తేడా ఉందేమో. మా వరకు గతంలోలాగే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగు పెట్టడం గుడ్ ఫీలింగ్ ఇచ్చింది. "మిస్ పర్ఫెక్ట్" సిరీస్ ను వరుణ్ చూసి మంచి క్వాలిటీతో బాగుందని చెప్పాడు. తనకు సిరీస్ మొత్తం నచ్చింది. ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ కూడా చేశాడు. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్ వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్స్ లో తను ఇన్వాల్వ్ కాడు. నేను ఎప్పుడైనా సెలెక్ట్ చేసుకున్న స్క్రిప్ట్ గురించి చెబితే వింటాడు. ఈ సిరీస్ స్క్రిప్ట్ వరుణ్ కు తెలుసు. చదివి బాగుందని చెప్పాడు. కొత్త డైరెక్టర్స్ తో వర్క్ చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్ గా ఉంటుంది. విశ్వక్ ఖండేరావ్ రైటింగ్ యూనిక్ గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం హ్యాపీగా ఫీలయ్యా. సెట్ లో ఎవరి ఒపీనియన్ అయినా తీసుకునేవారు. నేను చెప్పే సజెషన్స్ వినేవారు. పర్ఫెక్షనిస్ట్ గా ఉండటం ఎలా ప్రాబ్లమ్ అయ్యింది అనేది మీరు ఈ సిరీస్ లో చూస్తారు.

# 'తిరగబడరసామీ' నుంచి సెలబ్రేషన్ సాంగ్ విడుదల

యంగ్ అండ్ ప్రామెసింగ్ హీరో రాజ్ తరుణ్ హీరోగా, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి సెలబ్రేషన్ సాంగ్ ని విడుదల చేశారు. కంపోజర్ జేబీ ఈ పాటని పర్ఫెక్ట్ సెలబ్రేషన్ నెంబర్ గా కంపోజ్ చేశారు. లిప్సికా భాష్యం, అదితి బావరాజు, చైతు సత్సంగి వీనుల విందుగా అలపించారు. సుద్దాల అశోక్ తేజ లిరిక్స్ మరింత ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటలో విజువల్స్ కన్నుల పండగలా వున్నాయి. యువతని ఆకట్టుకునే రోమాన్స్ తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్ ని అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ తో ఈ చిత్రాన్ని రూపొందించారు. హిందీ బిగ్ బాస్ తో యావత్ భారతాన్ని అలరించిన మనరా చోప్రా ఈ చిత్రంలో ఓ విభిన్న పాత్రతో పాటు ప్రత్యేక గీతంతో అలరించబోతుంది. ఫిబ్రవరి 23న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# రేవ్ పార్టీ" సెన్సార్ కు రెడీ




సినిమా అంటే ప్యాషన్‌తో పరిశ్రమలోకొచ్చాడు హీరో క్రిష్ సిద్దిపల్లి. అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తూనే అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేశారు. క్షణం సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి ఎగ్జ్ గ్యూటీవ్ ప్రొడ్యూసర్ నుంచి హీరోగా ఆయన జర్నీ ఎంతో స్ఫూర్తిదాయకం. గూడాచారీ, టైగర్ నాగేశ్వరరావు చిత్రాలకు ఎగ్జ్ గ్యూటీవ్ ప్రొడ్యూసర్ గా పనిచేశారు. 2021లో నేను లేని నా ప్రేమ కథ చిత్రంతో వెండితెరకు హీరోగా పరిచయం అయ్యారు. ఒక్కో సినిమా చేసుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన ఆడియన్స్ ను సంపాదించుకుంటున్నాడు ఈ యంగ్ హీరో. ప్రస్తుతం క్రిష్ సిద్దిపల్లి హీరోగా తెరకెక్కుతున్న రేవ్ పార్టీ సెన్సార్ కు రెడీ అయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫిబ్రవరి 3 హీరో క్రిష్ సిద్దిపల్లి పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. యువతకు నచ్చేలా వినుత్నమైన కథతో తెరకెక్కుతున్న తాజా చిత్రం రేవ్ పార్టీ. ఇనవర్స్ సినిమా ఫ్యాక్టరీ మరియు సూరం మూవీస్ బ్యానర్ పై రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న "రేవ్ పార్టీ" సెన్సార్ కు రెడీ అయింది. క్రిష్ సిద్దిపల్లి, రితిక చక్రవర్తి, ఐశ్వర్య గౌడ, సుచంద్ర ప్రసాద్, తారక్ పొన్నప్ప, తదితరుల ముఖ్య తారగణంతో మైసూర్, ఉడిపి, బెంగళూరు, మంగళూరు తదితర ప్రాంతాల్లో 35 రోజులు ఏకధాటిగా షూటింగ్ జరుపుకుంది. రేవ్ పార్టీ సినిమాకు త్వరలో రిలీజ్ డేట్ ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ రోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న హీరో క్రిష్ సిద్దిపల్లికి చిత్ర యూనిట్ బెస్ట్ విషెస్ తెలియజేశారు.

# ఏ ఎం ఆర్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏ మహేష్ రెడ్డి ఛాంపియన్స్ ఆఫ్ చేంజ్ 2024 అవార్డు



శ్రీ ఏ. మహేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. భారతదేశంలో సాంఘిక సంక్షేమ రంగంలో ఆయన చేసిన ఆదర్శప్రాయమైన మరియు స్ఫూర్తిదాయకమైన పనికి ఛాంపియన్స్ ఆఫ్ చేంజ్ 2024 అవార్డుని ఇవ్వడం జరిగింది. ఏ ఎం ఆర్ గ్రూప్ అధినేత ఏ మహేష్ రెడ్డి గారు వ్యాపారాన్ని మొదలుపెట్టిన అతి కొద్ది కాలంలోనే ఉన్నత యువ వ్యాపారవేత్తగా ఎదిగారు. ఈరోజు మైనింగ్ వ్యాపారంలో నెంబర్ 1 స్థానంలో నిలబడ్డారు. ప్రస్తుతం 5000 మంది పనిచేస్తున్న కంపెనీలో కనీసం లక్ష మంది ఉద్యోగాలు కల్పించాలని సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. షిరిడి సాయినాధుని ఎల్లప్పుడూ కొలిచే భక్తునిగా షిరిడీలోని మందిరానికి బంగారు సింహాసనాన్ని దానం చేశారు. అదేవిధంగా ఈయన ఆంధ్ర రాష్ట్రంలోనే కాక భారత దేశం లో పలు చోట్ల దైవ మందిరాలు కట్టించారు. శ్రీశైలం, కాణిపాకం, నెల్లూరులోని రామతీర్థం, శ్రీ రాజరాజేశ్వర టెంపుల్, శ్రీ పృద్వేశ్వర టెంపుల్ వంటి గుడి లు తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించారు. ఆయన గతంలో సాయి ప్రేరణ ట్రస్ట్ సంబంధించి సాయి తత్వాన్ని బోధించే విధంగా చేసిన సేవలకు 'మాలిక్ ఏక్ సుర్ అనేక్' అవార్డుతో ఆయనను సత్కరించారు. కోవిడ్ పాండమిక్ సమయంలో ఆంధ్ర తెలంగాణ ప్రభుత్వాలకు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారు. హైదరాబాదులో అనేక హెల్త్ క్యాంపులు నిర్వహించారు. అదేవిధంగా అయోధ్య శ్రీ రామ జన్మభూమికి కోటి రూపాయలు విరాళం అందించారు. ఏ ఎం ఆర్ ప్రొడక్షన్స్ ద్వారా భక్తి తత్వాన్ని బోధించే విధంగా రెండు తెలుగు సినిమాలను నిర్మించారు. అదేవిధంగా ఏ మహేష్ రెడ్డి గారు 148 కేజీల బంగారాన్ని సాయిబాబా సనాతన ట్రస్ట్ షిరిడి కి విరాళంగా అందజేశారు.

బుట్టబొమ్మ పూజా హెగ్డే కెరీర్ పరంగా కొన్ని చిక్కులను ఎదుర్కొంటున్నా కానీ ఇప్పుడిప్పుడే రికవరీతో ఆశ్చర్యపరుస్తోంది. ఈ భామ కొన్ని వరుస అవకాశాల్ని కోల్పోయాక కూడా, నెలల గ్యాప్ లో తదుపరి వరుసగా పలువురు అగ్ర హీరోల చిత్రాలకు సంతకాలు చేసింది. ఇకపోతే పూజా సోషల్ మీడియాల్లో తన గ్రిప్ ఏమాత్రం తగ్గకుండా వరుసగా వేడెక్కించే ఫోటోషూట్లను షేర్ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పూజా రెడ్ హాట్ లెహంగా యువతరంలో ప్రత్యేకించి చర్చకు వచ్చింది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ కి రెడ్ రైడింగ్ హుడ్ అని క్యాప్షన్ ఇచ్చింది. దీనికి #వెడ్డింగ్ సీజన్ అనే హ్యాష్ ట్యాగ్ ని జోడించింది. పెళ్లిళ్ల సీజన్ కి తగినట్టుగానే ఈ డిజైనర్ లెహంగా నిజంగా ఎంతో ఆకర్షిస్తోంది. పూజా ఈ భారీ లెహంగాలో ఎంతో అందంగా ఉందంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. షోల్డర్ లెస్ డిజైనర్ టాప్ తో పూజా అగ్గి రాజేస్తోందని కితాబిచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. పూజా నెక్ట్స్ ఏంటి? సింబు కథానాయకుడిగా కమల్ హాసన్ నిర్మిస్తున్న ఓ భారీ చిత్రంలో పూజా అవకాశం అందుకుందని కథనాలొస్తున్నాయి. సిలంబరసన్ TR అకా శింబు ఇటీవల బరువు తగ్గాక కవందే వెందు తనంత కాదు చిత్రాలతో విజయాలు అందుకున్నాడు. గత సంవత్సరం పాతు తాల విడుదలైంది, ఆ తర్వాత కమల్ హాసన్ నిర్మించిన STR 48 చిత్రంలో సిలంబరసన్ నటిస్తున్నాడు. ఈ చిత్రానికి దేశింగు పెరియసామి దర్శకత్వం వహిస్తారని, కమల్ హాసన్ భారీ పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు కథనాలొచ్చాయి. ఈ చారిత్రాత్మక చిత్రం కోసం సిలంబరసన్ TR థాయ్‌లాండ్‌లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. అతడు ద్విపాత్రాభినయం చేస్తారని సమాచారం అందింది. అయితే చిత్ర బృందం ఎటువంటి అధికారిక ప్రకటనా చేయలేదు.



# టాక్ ఆఫ్ ది టౌన్.. పూజా రెడ్ హాట్ లుక్